RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -312 పేజీలు - 08 వెల - 04/-

మంగళవారం 30 సెప్టెంబర్ 2025

## కనకదుర్గమ్మకు సీఎం చంద్రబాబు

# పట్టువస్త్రాలు

విజయవాడ దుర్గమ్మను సతీసమేతంగా దర్శించుకున్న సీఎం చంద్రబాబు

సీఎంకు స్వాగతం పలికిన మంత్రులు ఆనం, కొల్లు రవీంద్ర

పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు

ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించిన ఆలయ అర్చకులు

**విజయవాడ సెప్టెంబర్ 29,ఆంధ్ర ప్రగతి** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నాడు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.సంప్రదాయ వస్త్రధారణలో, సతీసమేతంగా ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఎం నేరుగా అమ్మవారి గర్భగుడికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలతో



మిగతా 2లో.

## వేర్వేరు థీమ్స్‌తో ప్రజల్లోకి వెళదాం : సీఎం చంద్రబాబు

# జీఎస్టీ 2.0 ఫలాలు ఇంటింటికీ...



ఇంటింటికీ జీఎస్టీ 2.0 ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ కార్యాచరణ

అక్టోబర్ 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా 65 వేల కార్యక్రమాలతో ప్రచారం

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరుతో అవగాహన సదస్సులు

కేబినెట్ సబ్ కమిటీతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

రంగాల వారీగా వినూత్న రీతిలో ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రణాళికలు

**విజయవాడ సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి** సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీ ప్రయోజనాలను రాష్ట్రంలోని ఇంటింటికీ తీసుకెళ్లేలా కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీతో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలను ప్రజలు, వినియోగదారుల్లోకి తీసుకెళ్లేలా విస్తృత ప్రచారం చేసేందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా 65 వేల సమావేశాలు, కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రజల్లోకి వెళ్లి, వచ్చే నెల 19వ తేదీ వరకు వేర్వేరు థీమ్‌లతో ఈ ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేబినెట్ కమిటీకి సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు.

దీనిపై అధికారులు మాట్లాడుతూ...ఇప్పటికే 'ఇంటింటికీ జీఎస్టీ ఫలాలు' థీమ్‌తో నిత్యవసరాలు, ఔషధాలు, స్టేషనరీ, వస్త్రాలు, క్రీడా వస్తువులు, రవాణా, మహిళలు, చిన్నారులకు సంబంధించిన వస్తులపై పన్నులు తగ్గిన అంశాన్ని విస్తృతంగా ప్రచారం నిర్వహించామని, క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన కల్పించామన్నారు.

మిగతా 2లో.

## జగన్ పాలనలో అనేక గుళ్లు ధ్వంసం

వైఎస్ కుటుంబం హిందూవ్యతిరేక వైఖరి

టిటిడిపై షర్మిల వ్యాఖ్యలు దారుణం మండిపడ్డ ఎపి బిజెపి చీఫ్ మాధవ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి** మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత అనేక దేవాలయాలపై దాడులు జరిగాయని ఏబీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. తిరుమల తిరుపతి నిధులతో గుళ్ల నిర్మాణం చేస్తే మీకేంటి ఇబ్బందని ఆయన ప్రశ్నించారు



మిగతా 2లో.

## ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో

# ఎంపీ మిథున్ రెడ్డికి బెయిల్

- 71 రోజుల తర్వాత రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదల
- రూ. 3,200 కోట్ల కుంభకోణంలో ఏ-4 నిందితుడిగా ఉన్న మిథున్ రెడ్డి
- విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఆదేశాలతో ఊరట
- మిథున్ రెడ్డితో పాటు మరో ముగ్గురు వైసీపీ నేతలకూ బెయిల్

**రాజమండ్రి సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో రాజంపేట ఎంపీ, వైసీపీ నేత మిథున్ రెడ్డికి ఊరట లభించింది. సుమారు 71 రోజుల పాటు జైలులో ఉన్న ఆయన సోమవారం రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక కోర్టు నేడు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మిథున్ రెడ్డి విడుదల నేపథ్యంలో జైలు వెలుపల సందడి నెలకొంది. ఆయన తండ్రి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మిగతా 2లో.

## "లోకేశ్ అన్నా.... ఇది నీకోసమే"

తిలక్ వర్మ గిఫ్ట్...

ముగ్ధుడైన నారా లోకేశ్

నారా లోకేశ్ కు తన క్యాప్ ను కానుకగా ఇచ్చిన తెలుగు క్రికెటర్

తమ్ముడూ నీ చేతుల మీదుగా అందుకునేందుకు ఎదురుచూస్తుంటానన్న లోకేశ్



2లో.

## ఫిల్మ్ ఇండిస్ట్రీకి ట్రంప్ షాక్

సినిమాలపై 100శాతం సుంకాలు

భారతీయ చిత్రాలపై భారీ ప్రభావం

మోడీ జోక్యం చేసుకోవాలంటున్న సినీ పరిశ్రమ



2లో.

## బాకీ కార్డుతో రేవంత్ భరతం పడతాం

కాంగ్రెస్ అభయ హస్తం ఆ పార్టీ పాలిట భస్మాసుర హస్తం : కేటీఆర్



2లో.

# స్థానిక నగారా

## రెండు విడతల్లో నిర్వహణ

- మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- ఆ తర్వాత మూడు విడతల్లో సర్పంచి ఎన్నికలు
- అక్టోబర్ 9 నుంచి తొలివిడత నామినేషన్ల స్వీకరణ
- నవంబర్ ఎనిమిదో తేదీతో ముగియనున్న ఎన్నికల ప్రక్రియ
- తెలంగాణలో రూరల్ ఓటర్ల సంఖ్య 1,67,03,168
- రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్





**హైదరాబాద్ సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి** స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. తొలుత రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని ప్రకటించారు. ఆ తర్వాత వెంటనే మూడు దశల్లో సర్పంచి ఎన్నికలు నిర్వహి స్తామని వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు.

మిగతా 2లో.



2లో.

## దేశంలోనే అతిపెద్ద పైరసీ ముఠా గుట్టు రట్టు!

పైరసీ ముఠాను పట్టుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు

తెలుగు చిత్ర పరిశ్రమకు సుమారు రూ. 3,700 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా

దుబాయ్, నెదర్లాండ్స్, మయన్మార్ కేంద్రంగా జరుగుతున్న పైరసీ కార్యకలాపాలు

పాప్‌కార్న్ డబ్బాలు, జేబుల్లో కెమెరాలు పెట్టి రికార్డింగ్

శాటిలైట్ కంటెంట్‌ను సైతం హ్యాక్ చేస్తున్న మేుఠా

సహా ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# జీఎస్టీ 2.0 ఫలాలు ఇంటింటికీ...

(మొదటి పేజి తరువాయి)

అన్ని వర్గాలకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేపట్టింది. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 19వ తేదీ వరకు వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, చేనేత ఉత్పత్తులు, ఆక్వా, విద్యారంగం, బీమా, ఎలక్ట్రానిక్స్, ఈ కామర్స్, భవన నిర్మాణ రంగం, టూరిజం, ఆతిథ్య రంగం, రవాణా, లాజిస్టిక్స్, క్రీడా పరికరాలు, పునరుత్పాదక విద్యుత్, ఆటో మొబైల్స్, తదితర అంశాలపై రంగాల వారీగా ఆయా శాఖలు ప్రచారం చేపట్టాలని సీఎం సూచించారు. రైతులకు అవగాహన కల్పించేలా ట్రాక్టర్ ర్యాలీలు, యంత్రాల ప్రదర్శన చేపట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఆప్కో, లేపాక్షి, ఒక జిల్లా-ఒక ఉత్పత్తి పేరిట కార్యక్రమాలు, ఎంఎస్ఎంఈ యూనిట్లలో తయారయ్యే ఉత్పత్తులు, దానికి సంబంధించిన పన్నుల తగ్గింపుపై ప్రచారం నిర్వహించేలా చూడాలన్నారు. సెలూన్లు, యోగా సెంటర్లు, జిమ్‌లలో జీఎస్టీల తగ్గింపు వల్ల ధరలు ఎంత వ్యత్యాసం వచ్చిందో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**విద్యార్థుల్లోనూ అవగాహన పెంచేలా కార్యక్రమాలు**

జీఎస్టీ తగ్గింపుతో స్టేషనరీ ఉత్పత్తులపైనా ధరలు గణనీయంగా తగ్గిన అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. వీటిపై అవగాహన కల్పించేలా విద్యార్థులకు వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలోని 7 వేల ఉన్నత పాఠశాలలు, 4 వేల జూనియర్ కాలేజీల్లో ఈ ప్రచారం నిర్వహించేలా ప్రణాళిక సిద్దం చేశారు. అలాగే జీవిత బీమా, ఆరోగ్య బీమాలకు సంబంధించి జీరో జీఎస్టీ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ఎలక్ట్రానిక్ వస్తువులకు సంబంధించి ధరలపై అవగాహన కల్పించేందుకు ఉత్పత్తిదారులు, డీలర్లతో జిల్లా, నియోజకవర్గ, మండలాల వారీగా 850కి పైగా చోట్ల కార్యక్రమాలు చేపట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఇ-కామర్స్ రంగానికి సంబంధించి గిగ్ వర్కర్లలో ద్విచక్ర ర్యాలీలు, స్వదేశీ ఉత్పత్తులపై ఎగ్జిబిషన్లు నిర్వహించనున్నారు. భవన నిర్మాణ రంగం, ఆతిథ్య రంగం, రవాణా, లాజిస్టిక్స్ పైనా జిల్లా, నియోజకవర్గాల్లో ఎగ్జిబిషన్లు, ర్యాలీలు చేపట్టేలా ప్రణాళిక చేపట్టారు. ఆటబొమ్మలు, క్రీడా పరికరాలు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, ఆటో మొబైల్స్ ధరలకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పిచేలా 200పైగా కార్యక్రమాలు చేపట్టనున్నారు.

**జిల్లా స్థాయిలో దీపావళి సంబరాలు**

జీఎస్టీ 2.0 వల్ల కలుగుతున్న లబ్ధిపై ప్రజలకు వివరించేలా వినూత్న రీతిలో కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది. అక్టోబర్ 18వ తేదీతో క్షేత్ర స్థాయిలో ప్రచారాన్ని ముగించి 19వ తేదీన జిల్లా కేంద్రాల్లో షాపింగ్ ఫెస్టివల్, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అదే రోజున జిల్లా కేంద్రాల్లో దీపావళి సంబరాలు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

వచ్చే 19వ తేదీ వరకు రేడియో, టీవీ, మీడియా, సోషల్ మీడియా, పత్రికా, సినిమా థియేటర్లు వంటి ప్రసార, ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల వద్ద కూడా జీఎస్టీ 2.0 ఫలాలు తెలిసేలా హోర్డింగులు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్, అధికారులు పాల్గొన్నారు.

# జగన్ పాలనలో అనేక గుళ్లు ధ్వంసం

.(మొదటి పేజి తరువాయి)

నిధులు ఆలయాల నిర్మాణాలు, ధార్మిక సంస్థల నిర్మాణం, ధూపదీప నైవేద్యం కోసం ఉపయోగించుకుంటున్నారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం టీటీడీలో 434 గదులు కూల్చి రూ. 600 వందల కోట్లు ఖర్చు చేశారని మండిపడ్డారు. దేవాలయాలను కించ పర్చడంలో దివంగత మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి కుటుంబం మొదటి నుంచి ఇదే వైఖరి వ్యవహరిస్తోందని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. జగన్ పరిపాలన జరిగిన అవినీతిపై విచారణ జరుగుతోందని ఆయన చెప్పుకొచ్చారు.అదేవిధంగా ఏపీ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి హిందూ మనోభావాలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడారని పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. టీటీడీ నిధులతో సుమారు 5 వేల దేవాలయాలు నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేశారని గుర్తు చేశారు. దేవాలయాల నిర్మాణాలు ఆర్ఎస్ఎస్ ఎజెండా అని షర్మిల వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. దేవాలయాలపై పరిజ్ఞానం లేకుండా, అవివేకంగా షర్మిల మాట్లాడారని విమర్శించారు. ఆమెకు దేవాలయాల వ్యవస్థపై ఎటువంటి అవగాహన, ఆలోచన లేదని పేర్కొన్నారు. వైఎస్ షర్మిల జీవితంలో ఎప్పుడైనా దేవాలయాలను సందర్శించారా అని మాధవ్ ప్రశ్నించారు. మత ప్రచారాలు స్వయంగా భర్తతో కలిసి చేశారని ఆరోపించారు. మత మార్పిడి చేయాలని పెద్ద ప్రయత్నం చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. టీటీడీపై షర్మిల చేసిన వ్యాఖ్యలపై సోనియాగాంధీ, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దివంగత మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి గతంలో ఏడుకొండలు మూడు కొండలుగా మార్చాలని జీవో ఇచ్చారని గుర్తు చేశారు. తిరుమల తిరుపతి నిధులు ఎలాంటి దుర్వినియోగం అవ్వడం లేదని స్పష్టం చేశారు. నిధులను ఆలయాల నిర్మాణాలు, ధార్మిక సంస్థల నిర్మాణం, ధూపదీప నైవేద్యం కోసం ఉపయోగించుకుంటున్నారని మాధవ్ వెల్లడించారు. ఏపీలో కూటమి నేతృత్వంలో మంచి పాలన జరుగుతుందని మాధవ్ తెలిపారు. డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వడం మంచి పరిణామమని పేర్కొన్నారు. అందుకు కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు అభినందనలు తెలిపారు. పెట్టుబడులకు మంచి అవకాశంగా అమరావతి ఉందని పేర్కొన్నారు. గ్రీన్ హైడ్రోజన్ పనులు నడుస్తున్నాయని వివరించారు. కొత్తగా కొన్ని పోర్టుల నిర్మాణాలు జరుగు తున్నాయని స్పష్టం చేశారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తామంటూ.. పోలీసులను, కాంట్రాక్టులను బెదిరించడం మంచిది కాదని హెచ్చరించారు. జగన్ వైఖరి మారకపోతే వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా రావని హితవు పలికారు. జగన్మోహన్ రెడ్డి వైఖరిని అన్నివర్గాల ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు.

# మోగిన స్థానిక నగారా

(మొదటి పేజి తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు స్థానిక ఎన్నికల నిర్వహణకు ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. సోమవారం నుంచే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి తొలి విడత ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ తొమ్మిదో తేదీన ప్రారంభమై నవంబర్ 11వ తేదీన ముగుస్తుందనీ, రెండో విడత ఎన్నికల ప్రక్రియ 13.10.25న ప్రారంభమై 11.11.25న పూర్తవు తుందని వివరించారు. గ్రామపంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహిస్తామని వెల్లడించారు. తొలివిడత ఎన్నికల ప్రక్రియ 17.10.25న ప్రారంభమై 31.10.25న పూర్తవుతుందనీ, రెండో విడత ఎన్నికల ప్రక్రియ 21.10.25న మొదలై 04.11.25న పూర్తవుతుందనీ, మూడో విడత ప్రక్రియ 25.10.25న ప్రారంభమై 08.11.25న ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. జీపీ ఎన్నికలకు 15,522 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి 15,302 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఒక్కో దశ ఎన్నికల ప్రక్రియ 15 రోజుల్లో ముగిస్తుందని తెలిపారు.

ఈ సమావేశంలో డీజీపీ జితేందర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన, తదితర అధికారులు పాల్గొన్నారు. జిల్లాల ఎన్నికల అధికారులు రిజర్వేషన్లకు సంబంధించిన డేటా తమకు అందజేశారని తెలిపారు. దానికి సంబంధించిన గెజిట్‌లు కూడా విడుదల చేశారని చెప్పారు. ఈసీఐ నుంచి ఎలక్ట్రోరల్ జాబితాను తెప్పించుకుని పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాను ఈ నెల పదో తేదీ నాటికి ఫైనల్ చేశామని తెలిపారు. జులై 15 వరకు సవరించిన ఓటర్ల జాబితా డేటా ఆధారంగా మండలాల వారీగా ఎంపీడీఓలు, డీపీఓల ద్వారా ముసా యిదా డ్రాఫ్టులు విడుదల చేశారని తెలిపారు. వర్షాల సమయంలోనూ ఓటర్ల జాబితా రూపొందిం చేందుకు ఎన్నికల అధికారులు కష్టపడ్డారని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఓటర్లు, పోటీచేసే అభ్యర్థులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సహకరించాలనీ, ఎన్నికల సమాచారాన్ని ఎప్పటిక ప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

**బ్యాలెట్ పద్ధతిలోనే**

బ్యాలెట్ పద్ధతిలోనే స్థానిక ఎన్నిలను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించనున్నది. ఒకేసారి ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచి ఎన్నికలు నిర్వహిస్తున్న తరుణంలో అవసరాల రీత్యా బ్యాలెట్ బాక్సులను గుజరాత్, కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా తెప్పిస్తున్నది.

తొలి విడతలో 1998 పంచాయతీలకు, రెండో విడతలో 5414 పంచాయతీలకు, మూడో విడతలో 5321 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచి, వార్డు మెంబర్ల నామినేషన్ల స్వీకరణకు ప్రతి విడతలోనూ రెండు రోజుల సమయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం కేటాయించింది. ఆ రెండు రోజుల పాటు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లను అధికారులు స్వీకరిస్తారు. నామినేషన్లు తిరస్కరణకు గురి అయితే అప్పీల్ చేయడానికి ఒకరోజు, పరిష్కరించడానికి ఒకరోజు సమయాన్ని ఎన్నికల సంఘం వెచ్చించనున్నది. ప్రతి విడతలోనూ గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుంది. తదనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. అదే రోజు ఫలితాన్ని డిక్లేర్ చేస్తారు. ఒకవేళ అనివార్య పరిస్థితుల్లో ఫలితం తేలకుంటే మరుసటిరోజు ప్రకటిస్తారు.

# ఫిల్మ్ ఇండిస్టీకి ట్రంప్ షాక్

**సినిమాలపై 100శాతం సుంకాలు**

**భారతీయ చిత్రాలపై భారీ ప్రభావం**

**మోడీ జోక్యం చేసుకోవాలంటున్న సినీ పరిశ్రమ**

వాషింగ్టన్: **సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే భారత ఎగుమతులపై 50శాతం సుంకాలు, ఫార్మాపై 100 శాతం సుంకాలు విధించిన ట్రంప్ తాజాగా మరో నిర్ణయం తీసుకున్నారు. దాంతో భారతీయ చిత్రాలపై భారీ ప్రభావం పడనున్నది. అమెరికా వెలుపల నిర్మించే సినిమాలపై సుంకాలు అమలు చేయనున్నట్టు హెచ్చరించారు. వందశాతం సుంకాలను విధించనున్నట్టు ప్రకటించారు. విదేశీ సినిమాలపై వందశాతం సుంకాలు అమలుకానున్నాయి. 'మా సినిమా నిర్మాణ వ్యాపారాన్ని అమెరికా నుంచి.. ఓ శిశువు నుంచి మిఠాయిని తొలగించినట్టుగా ఇతరదేశాలు దొంగిలించాయని ఆయన ఆరోపించారు. బలహీనమైన, అసమర్థ గవర్నర్‌తో ఉన్న కాలిఫోర్నియా ముఖ్యంగా తీవ్రంగా దెబ్బతింది అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు. ఈ దీర్ఘకాల, ఎప్పటికీ అంతం కాని సమస్యను పరిష్కరించడానికి తాను



అమెరికా వెలుపల నిర్మించే అన్ని సినిమాలపై 100శాతం సుంకం విధించనున్నట్టు పేర్కొన్నారు. విదేశీ సినిమాలతో అమెరికన్ సినిమా పరిశ్రమకు 'జాతీయ ముప్పు'గా ట్రంప్ భావిస్తూ ట్రంప్ ఇలాంటి ప్రకటన చేశారు.

# ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఎంపీ మిథున్ రెడ్డికి బెయిల్

(మొదటి పేజి తరువాయి)

కూడా జైలు వద్దకు వచ్చి కుమారుడికి స్వాగతం పలికారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ. 3,200 కోట్లకు పైగా మద్యం కుంభకోణం జరిగిందని ఏసీబీ అధికారులు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో మిథున్ రెడ్డిని ఏ-4 నిందితుడిగా పేర్కొంటూ జూలై 20న అరెస్ట్ చేశారు. షెల్ కంపెనీల ద్వారా భారీ మొత్తంలో ముడుపులు సేకరించి, వాటిని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు చేరవేశారని ఛార్జ్‌షీట్‌లో అభియోగాలు మోపారు.అరెస్ట్ అయినప్పటి నుంచి బెయిల్ కోసం మిథున్ రెడ్డి పలుమార్లు ప్రయత్నించారు. మొదట హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లు తిరస్కరణకు గురయ్యాయి. అయితే, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసేందుకు సెప్టెంబర్ 6న ఏసీబీ కోర్టు ఆయనకు తాత్కాలిక బెయిల్ ఇచ్చింది. ఓటు వేసిన అనంతరం ఆయన తిరిగి జైలుకు వెళ్లారు. ఇటీవల సెప్టెంబర్ 19న సిట్ అధికారులు ఆయనను విజయవాడ కార్యాలయంలో విచారించారు.

ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కె. ధనుంజయ్ రెడ్డి, పి. కృష్ణమోహన్ రెడ్డితో పాటు భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజి గోవిందప్పకు కూడా ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేయడం గమనార్హం. ఈ స్కామ్‌పై ఏసీబీతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేస్తోంది.

# కనకదుర్గమ్మకు సీఎం చంద్రబాబుపట్టువస్త్రాలు





(మొదటి పేజి తరువాయి)

పాటు పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, గాజులను కూడా ఆయన అమ్మవారికి అర్పించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా భువనేశ్వరి దంపతులకు శాస్త్రోక్తంగా వేదాశీర్వచనం పలికారు. దర్శనానంతరం వారికి తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్రపటం అందజేశారు. ముఖ్యమంత్రి రాకతో ఇంద్రకీలాద్రిపై కోలాహలం నెలకొంది.

# "లోకేశ్ అన్నా...ఇది నీకోసమే"

## తిలక్ వర్మ గిఫ్ట్... ముగ్ధుడైన నారా లోకేశ్

**సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి**

దుబాయ్ లో గతరాత్రి జరిగిన ఆసియా కప్-2025 ఫైనల్లో టీమిండియా అద్భుత విజయం సాధించడం తెలిసిందే. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ ను ఓడించి 9వ సారి కప్ కైవసం చేసుకోవడంలో తెలుగు క్రికెటర్ తిలక్ వర్మ ప్రధాన పాత్ర పోషించాడు. టాప్-3 బ్యాటర్లు పెవిలియన్ చేరిన క్రమంలో ఎంతో నిబ్బరంగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. వర్మ 53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులతో 69 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

కాగా, మ్యాచ్ అనంతరం ఆసక్తికర దృశ్యం ఆవిష్కృతమైంది. తన క్యాప్ ను తిలక్ వర్మ ఏపీ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కు కానుకగా ఇచ్చాడు. లోకేశ్ అన్నా ఇది నీకోసమే... ప్రేమతో ఇస్తున్నాను అంటూ ఆ క్యాప్ పై రాసి సైన్ చేశాడు. ఈ మేరకు వీడియో పంపించాడు. దీనిపై మంత్రి నారా లోకేశ్ స్పందించాడు. తిలక్ వర్మ అభిమానం తనను ముగ్ధుడ్ని చేసిందని పేర్కొన్నాడు. "తమ్ముడూ... నీ ప్రేమ పట్ల ఎంతో సంతోషిస్తున్నాను... నువ్వు భారత్ తిరిగిరాగానే ఆ క్యాప్ ను నీ చేతుల మీదుగా అందుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తుంటాను... నువ్వు ఛాంపియన్" అంటూ ట్వీట్ చేశారు.

# దేశంలోనే అతిపెద్ద పైరసీ ముఠా గుట్టు రట్టు!

## పైరసీ ముఠాను పట్టుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు

హైదరాబాద్ **సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి**

తెలుగు చిత్ర పరిశ్రమతో పాటు దేశవ్యాప్తంగా సినీ రంగాన్ని దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న పైరసీ భూతంపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. దేశంలోనే అతిపెద్దదిగా భావిస్తున్న అంతర్జాతీయ పైరసీ ముఠా గుట్టును రట్టు చేసి, ఆరుగురు కీలక సభ్యులను అరెస్టు చేశారు. ఈ ముఠా కార్యకలాపాల వల్ల కేవలం తెలుగు ఇండస్ట్రీకే సుమారు రూ. 3,700 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు.ఈ ముఠా అత్యంత పకడ్బందీగా, ఆధునిక టెక్నాలజీని వాడుతూ పైరసీకి పాల్పడినట్లు విచారణలో తేలింది. థియేటర్లలోకి వెళ్లే ఏజెంట్లు పాప్‌కార్న్ డబ్బాలు, చొక్కా జేబులు, కూల్ డ్రింక్ టిన్నలో హై-ఎండ్ కెమెరాలు పెట్టి సినిమాలను చిత్రీకరించేవారు. రికార్డింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ స్క్రీన్ లైట్ కూడా ఆఫ్ అయ్యేలా ప్రత్యేక యాప్‌లను ఉపయోగించడంతో ఎవరికీ అనుమానం వచ్చేది కాదని పోలీసులు తెలిపారు. కొన్నిసార్లు థియేటర్లకు శాటిలైట్ ద్వారా పంపే కంటెంట్ ఐడీ, పాస్‌వర్డ్‌లను కూడా హ్యాక్ చేసి నేరుగా ఒరిజినల్ ప్రింట్లను దొంగిలించినట్లు సీపీ వివరించారు.ఇటీవల 'చసింగిల్' అనే సినిమా పైరసీకి గురైనట్లు అందిన ఫిర్యాదుతో ఈ కేసు దర్యాప్తు మొదలైంది. ఈ క్రమంలో జులై 3న వనస్థలిపురానికి చెందిన జానా కిరణ్ కుమార్ అనే ప్రధాన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా ఈ ముఠా వెనుక ఉన్న అంతర్జాతీయ నెట్‌వర్క్ బయటపడింది. ముఠాలోని కీలక సభ్యులు దుబాయ్, నెదర్లాండ్స్, మయన్మార్ వంటి దేశాల నుంచి తమ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు, పోలీసులకు చిక్కకుండా నెదర్లాండ్స్‌కు చెందిన ఐపీ అడ్రస్‌లను వాడుతున్నట్లు గుర్తించారు. ఏజెంట్లకు చెల్లింపులను క్రిప్టో కరెన్సీ రూపంలో జరిపేవారు. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ, "టెలిగ్రామ్ ఛానెల్స్, టొరెంట్స్ ద్వారానే కాకుండా కొత్తగా 'ఎంవో' అనే పద్ధతిలోనూ పైరసీ చేస్తున్నారు. థియేటర్లలో కెమెరాలతో రికార్డ్ చేయడమే కాక, శాటిలైట్ సిగ్నల్ ను కూడా హ్యాక్ చేసి పైరసీకి పాల్పడుతుండటం ఆందోళన కలిగించే విషయం. దీనివల్ల నిర్మాతలు తీవ్రంగా నష్టపోతున్నారు" అని అన్నారు. ఈ ముఠా ఇప్పటివరకు తెలుగు, తమిళం, హిందీతో కలిపి సుమారు 40 చిత్రాలను పైరసీ చేసినట్లు ఆయన తెలిపారు.

# బాకీ కార్డుతో రేవంత్ భరతం పడతాం

## కాంగ్రెస్ అభయ హస్తం ఆ పార్టీ పాలిట భస్మాసుర హస్తం : కేటీఆర్

హైదరాబాద్ **సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి**

కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు తమ పార్టీ ప్రారంభించిన 'బాకీ కార్డు' ఉద్యమంతో రేవంత్ సర్కార్ భరతం పట్టబోతున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. గల్లీ ఎన్నికలైనా, ఢిల్లీ ఎన్నికలైనా గెలిచేది బీఆర్ఎస్సేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలోని సబ్బండ వర్ణాలు తిరిగి కేసీఆర్‌నే ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నాయని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ప్రదీప్ చౌదరి%ా% సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ%ా%ఎన్నికల సమయంలో తామిచ్చిన హామీల గురించి ప్రజలు మరిచిపోయారనే భావనలో కాంగ్రెస్ నాయకులున్నారని విమర్శించారు. కానీ ప్రజలకు అన్ని విషయాలూ గుర్తున్నాయని చెప్పారు. 'కాంగ్రెస్ అభయహస్తం' అంటూ అధికార పార్టీ నేతలు ఆర్భాటపు ప్రకటనలు గుప్పిస్తున్నారనీ, వాస్తవానికి అదే ఆ పార్టీ పాలిట భస్మాసుర హస్తం కాబోతోందని ఎద్దేవా చేశారు. రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా, హైదరాబాద్ నగరం సమస్యలతో ఆగమాగమవుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త నగరం కడతానంటూ ఊదరగొడుతున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు.

# కొలిమిగుండ్లలో రక్తదాన శిబిరం పాల్గొన్నఅభిరుచి మధు.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారి జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహించిన సేవా పక్షోత్సవం కార్యక్రమంలో కొలిమిగుండ్లలో రక్తదాన శిబిరం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు ముఖ్య అతిథిగా హాజరై, రక్తదానం చేసిన ప్రజలను అభినందించారు.కార్యక్రమాన్ని బిజెపి మండల అధ్యక్షుడు రామసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించగా, నిమ్మకాయల సుధాకర్, బాలు, మండల నాయకులు, స్థానిక యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రక్తదానం జరిగింది, ఇది ప్రజల మధ్య సేవా భావాన్ని చాటింది. అభిరుచి మధు మాట్లాడుతూ, "ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం గర్వకారణం. రక్తదానం కేవలం ఆరోగ్య పరిరక్షణకు మాత్రమే కాకుండా, సమాజానికి సేవ చేయడం ద్వారా మనందరికీ కొత్త స్ఫూర్తినిస్తుంది. నంద్యాల జిల్లా ప్రజలు కూడా ఇలాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని దేశాభివృద్ధికి సహకరిస్తున్నారు" అని అన్నారు. అలాగే, ఆయన కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా సంక్షేమ పథకాలను, ఆరోగ్య, విద్య, మౌలిక సౌకర్యాల అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామీణ ప్రాంత అభివృద్ధి, యువతకు అవకాశాల సృష్టికు బిజెపి నేతలుగా ప్రత్యేక శ్రద్ధ పెట్టుతామని హామీ ఇచ్చారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు అభిరుచి మధు గారి నాయకత్వం వలన స్థానికులలో రాజకీయ అవగాహన, సేవా భావం పెరుగుతోందని పేర్కొన్నారు. రక్తదాన శిబిరం తర్వాత స్థానికులు ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే అవకాశాలపై ప్రశ్నలు అడిగి, ప్రత్యక్ష మార్గనిర్దేశాన్ని పొందడం ప్రత్యేకంగా ఆకర్షణీయంగా నిలిచింది. ఈ కార్యక్రమం ద్వారా కొలిమిగుండ్ల ప్రజలు సేవా, భరోసా, మరియు నాయకత్వంలో భాగస్వామ్యం అనే సందేశాన్ని స్పష్టంగా అందుకున్నారు.

# వైసీపీ నాయకుల,కార్యకర్తలపై జరిగిన.. జరిగే అన్యాయాలను డిజిటలైజ్డ్ చేయండి.

**బాధితులకు తప్పకుండా న్యాయం తప్పకుండా చేస్తాం. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి వైసీపీ నేతలపై, కార్యకర్తలపై జరుగుతున్న అన్యాయాలు, దౌర్జన్యాలు, మర్డర్లు, కక్షపూరిత చర్యలను అన్నింటిని రిజిస్టర్ చేసేందుకు రూపొందించిన డిజిటల్ బుక్ కోసం క్యూఆర్ కోడ్ ద్వార స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో డిజిటల్ బుక్ లో నమోదు కొరకు రూపొందించిన క్యూఆర్ కోడ్ పోస్టర్లను శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి , వైసీపీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ భాషా మాజీ మార్కెఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ రామసుబ్బారెడ్డి, రాష్ట్ర మాజీ ఉమెన్ వింగ్ ఉపాధ్యక్షురాలు డా. శశికళారెడ్డి, నంద్యాల మండల వైసీపీ అధ్యక్షుడు బసవేశ్వరరెడ్డి, డిస్ట్రిక్ట్ ఇనటలెక్చువల్ ప్రసిడెంట్ రసూల్ ఆజాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవనగర్ బాష, డిస్ట్రిక్ట్ స్పోక్ పర్సన్ అనీల్ అమృతరాజ్, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టైలర్ శివ, , ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు, నెరవాటి సత్యనారాయణ, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన పెట్టి వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలు, మర్డర్లు, కక్షసాధింపు చర్యలు, ఆస్తుల విధ్వంసం, ఆక్రమణలు, ఇలా అనేక అన్యాయాలకు తెరతీసిందని అన్నారు. ఇటువంటి చర్యలను కాలం మరచిపోవచ్చని, జరిగిన అన్యాయాలను, అక్రమాలను మరచి పోకుండా బధ్రపరిచేందుకు వైఎస్సార్సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ ను రూపొందించడం జరిగిందని, ఇవ్వబడిన క్యూర్ కోడ్ ను స్కాన్ చేసి అందులో జరిగిన అన్యాయాలను రిజిస్టర్ చేయాలని కోరడం జరిగిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన కాలంలో అధికారులు అన్యాయంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించడం జరుగుతుందని, ఇటువంటి వారు భవిషత్తులో జవాబు చెప్పకతప్పదని, మూల్యం చెల్లించక తప్పదని, వడ్డీతో సహా బదులు ఇవ్వాల్సి వస్తుందన్నారు.

# దివ్యాంగులకు నెలవారి మందుల పంపిణీ.

**లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్, కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి రవి ప్రకాష్ సౌజన్యంతో.**

**ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో. నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నిర్వహణ.**

**దివ్యాంగులకు సహకారం నిరంతరం కొనసాగిస్తాం: డాక్టర్ రవి కృష్ణ.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం నిర్వహణలో సోమవారం సంఘం కార్యాలయంలో ప్రపంచ గుండె దినోత్సవం పురస్కరించుకుని, 20 మంది దివ్యాంగులకు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్, కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి రవి ప్రకాష్ సౌజన్యంతో పదిహేను వేల రూపాయల విలువచేసే నెల వారి మందుల పంపిణీ చేశారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య పాల్గొని మాట్లాడుతూ దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే దివ్యాంగులకు నెలవారి మందుల పంపిణీ నిరంతరం కొనసాగిస్తామన్నారు. మందులు కొనుగోలు చేసి



ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం ఒక నెల మందులు ఉచితంగా అందిస్తున్న రవి ప్రకాష్ కు ధన్యవాదాలు తెలిపి శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. దాత రవి ప్రకాష్ మాట్లాడుతూ దివ్యాంగులకు సేవలు అందించడం వ్యక్తిగత సామాజిక బాధ్యతగా భావించి సహకరిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సోమేసుల నాగరాజు, కోశాధికారి అమిదేల



జనార్ధన్, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య, కార్యాలయ కార్యదర్శులు మధు,వెంకటేశ్వర్లు, సూర్య, దివ్యాంగ లబ్ధిదారులు వారికి తోడుగా వచ్చిన వారు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎన్ఎండి ఫయాజ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:** సాయి చింటూ జయంతి సందర్భంగా వారి మిత్రబృందం ఆధ్వర్యంలో తల సేమియా చిన్నారులకు మరియు గర్భిణీ మహిళల కోసం నంద్యాల బ్లడ్ సెంటర్ నందు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ.. తమ మిత్రుడు సాయి చింటు తమ మధ్యలో లేదని అనుకోకుండా మిత్రుని జ్ఞాపకార్థం కోసం వారిని స్మరిస్తూ వారి జయంతి , వర్ధంతి వేడుకలను నిర్వహించడం చాలా సంతోషంగానూ గర్వకారణం గాను ఉందన్నారు ఈ మంచి పనిలో తలసేమియా చిన్నారులకు మరియు గర్భిణీ మహిళల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం మంచి శుభ పరిణామం అన్నారు వీరి కార్యక్రమాలు ఇలాగే జరగాలని కోరుకుంటూ చింటు మిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు .. అనంతరం నిర్వాహకులు ముఖ్య అతిధులను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి యూత్ అధ్యక్షులు మహబూబ్ గల్లి , నంద్యాల బ్లడ్ సెంటర్ అచ్చ, పవన్, సంపత్, మనోహర్, సుమంత్ , సుభాష్ , ప్రసాద్, కార్తీక్, మహేష్ , సాదిక్, వినయ్, ఈశ్వర్, రఘు , భాను ప్రకాష్, కాజా తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి ఫరూక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:** నంద్యాల పట్టణంలోని 35 వార్డు సలీంనగర్ నందుగల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు సోమవారం నంద్యాల పురపాలక సంఘం వారు నిర్వహించిన సఫాయిమిత్ర సురక్ష శివార్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి పాల్గొని మున్సిపల్ పీహెచ్ మరియు మున్సిపల్ నాన్ పిహెచ్ కార్మికులకు ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా నంద్యాలలో పారిశుద్ధ కార్మికులకు ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పేద కార్మికులు అనారోగ్యాన పడితే ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టుకోలేక వారి ఆరోగ్యాన్ని గాలికి వదిలేస్తారని అలా జరగకుండా ప్రభుత్వం వారి ఆరోగ్యాన్ని రక్షించాలని ఉద్దేశంతో ఈరోజు వారికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వారికి ఏ ఆరోగ్య సమస్యలు ఉన్నాయో వాటిని గుర్తించి వారికి వైద్యం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు అలాగే వాటికి సంబంధించిన మందులు కూడా వారికి ఇవ్వడం జరిగిందని తెలిపారు. అలాగే మన జిల్లాలో ఎక్కువగా సిజరింగ్ ఆపరేషన్లు జరుగుతున్నాయని వాటిని అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలా సిజరింగ్ ఆపరేషన్లు చేయడం ద్వారా భవిష్యత్తులో ఆ మహిళకు ఆరోగ్య సమస్యలు తలెత్తడం జరుగుతుందన్నారు కాబట్టి దీనిని కచ్చితంగా అరికట్టడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ప్రభుత్వ అధికారులు, డాక్టర్లు మరియు టిడిపి కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జిలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి ఫరూక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:** సంవత్సరాల తర్వాత నంద్యాలలో జరిగిన పెన్షనర్స్ అసోసియేషన్ ఎన్నికలలు 26 వ తేదీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఎన్నికలలో ఏనుగు గుర్తు ఘన విజయం సాధించడంతో నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ లను మర్యాదపూర్వకంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కలవడం జరిగింది.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. ముందుగా ఎన్నిక కాబడిన కార్యవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఎదురైనా నా దృష్టికి తీసుకురావాలని వాటిని కచ్చితంగా పరిష్కరిస్తామని పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామసుబ్బయ్య , సహా అధ్యక్షులు గఫార్, కోశాధికారి ఖాసిం వలి, ఉపాధ్యక్షులు డేవిడ్, పద్మనాభం, రంగనాథరావు, ప్రధాన కార్యదర్శి లింగస్వామి, రిటైర్డ్ లెక్చరర్ తోటరామయ్య , రిటైర్డ్ హెచ్ఎం జగన్ మోహన్ రెడ్డి, సుబ్బారాయుడు , తోట రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ గుండె దినోత్సవ ర్యాలీ

# ప్రారంభించిన ఎస్పీ సునీల్ షేరాన్.

**ఇండస్ హార్ట్ ఆసుపత్రి, నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో "గుండె రక్షణ కోసం నడక", ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహణ.**

**మితాహారం, క్రమం తప్పని వ్యాయామం, పొగాకు దూరంగా ఉండటం గుండెకు రక్షణ కల్పిస్తుంది: ఎస్పీ సునీల్.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:** సోమవారం ప్రపంచ గుండె దినోత్సవ సందర్భంగా ఇండస్ హార్ట్ ఆసుపత్రి, నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో "గుండ రక్షణ కోసం నడక" ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు.
నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని నడక ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మితాహారం, తగినంత వ్యాయామం, పొగ తాగడం వంటి ఇతరులవాట్లకు దూరంగా ఉండటం ద్వారా గుండెను పది కాలాలపాటు పదిలంగా రక్షించుకోవచ్చు అని అన్నారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు మాట్లాడుతూ ప్రజల అవగాహన కోసం ఐఎంఏ ఆధ్వర్యంలో వివిధ రకాల వ్యాధుల పట్ల తీసుకోవలసిన ముందు జాగ్రత్తల గురించి ర్యాలీలు,సదస్సులు ఆయా జబ్బుల ప్రత్యేక రోజులలో నిర్వహిస్తూ ఉన్నామన్నారు.
ఇండస్ ఆసుపత్రి గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ జహంగీర్,డాక్టర్ మురళీకృష్ణ,గుండె శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ కోటి శ్రీనివాస్ మాట్లాడుతూ స్థూలకాయం రాకుండా చూసుకోవడం ద్వారా, షుగరు బీపీ వంటి జబ్బులు ఉన్నవారు సరైన చికిత్స తీసుకుంటూ నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా, నిత్యం క్రమం తప్పకుండా నడక తదితర వ్యాయామాలు చేయడం ద్వారా, పొగాకు దూరంగా ఉండటం ద్వారా గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు అన్నారు. ఛాతీ లో నొప్పి, ఒళ్లంతా చెమటలు పట్టడం,ఛాతీ నొప్పి భుజానికి, వెనుకకు, దవడకు పాకినట్లు ఉండడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు అజాగ్రత్త చేయరాదన్నారు. ఎటువంటి శ్రమ, మెట్లు ఎక్కడం, ఎక్కువ దూరం నడవడం లాంటివి చేయకుండా వెంటనే ఈసీజీ తీసి ఇతర పరీక్షలు చేసి అది గుండె పోటా కాదా అని నిర్ధారణ చేసే ఆసుపత్రుల దగ్గరికి వెళ్లడం ఎంతో అవసరం అన్నారు. గుండెపోటు వచ్చిన సమయంలో మొదటి గంట చాలా కీలకమన్నారు. ఆ సమయంలో సరైన చికిత్స చేస్తే ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చు అన్నారు. ఒకసారి గుండెపోటు వచ్చిన వారు యాంజియోగ్రామ్ పరీక్ష చేయించుకుని గుండె రక్తనాళాలు మూసుకుపోయి ఉన్నాయా లేదా చూసుకుని అవసరం అయితే యాంజియో ప్లాస్టి, లేదా ఎక్కువ నాళాలు మూసుకుపోతే బైపాస్ ఆపరేషన్ చేయించుకోవలసి ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ వైద్య సేవలో ఈ చికిత్సలను పొందుపరిచారని అన్నారు. ఇండస్ ఆసుపత్రి నుండి ప్రారంభమైన "గుండె రక్షణ కోసం నడక " ర్యాలీ సంజీవనగర్ గేట్ వరకు కొనసాగింది. పెద్ద ఎత్తున వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది గుండె రక్షణకు సంబంధించిన స్లోగన్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ జావలి ఆల్ఫోన్స్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి, టూ టౌన్ సిఐ అస్రార్ భాష, వన్ టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ హరినాథ రెడ్డి, డాక్టర్ విజయబాబు, డాక్టర్ వివేకానంద రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ శ్రావణి, డాక్టర్ షర్మిల, డాక్టర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.






## నకిలీ మొక్కజొన్న విత్తనాల వల్ల నష్టపోయిన

# రైతులకు ఎకరాకు 50000 చెల్లించాలి.

**బేయర్, నూజివీడు, జిల్ కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.**

**నకిలీ విత్తనాలు విక్రయించిన షాపు యజమానుల లైసెన్సులు రద్దు చేయాలి. -ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా సెప్టెంబర్ 29:** నంద్యాల జిల్లా నందికొట్కూరు, జూపాడు బంగ్లా మండలాల్లో నకిలీ విత్తనాలు వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి 50,000 చెల్లించి రైతులను ఆదుకోవాలని, నకిలీ విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలు, విక్రయించిన షాపు యజమానుల పైన కఠినమైన చట్టబరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్, సహాయ కార్యదర్శిలు టి .రామచంద్రుడు, టి. వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు వి సుబ్బారాయుడు గార్లతో కూడిన ప్రతినిధి బృందం కలెక్టర్ వారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అలాగే వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, అంత కోతలు ప్రారంభమైనందువల్ల జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరలు అమలు చేయాలని కలెక్టర్ ని కోరారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల సమస్య పైన విచారణ చేయిస్తున్నామని, నేడు ప్రతి రైతు పొలంలో శాస్త్రవేత్తలతో పరిశీలన చేయిస్తున్నామని, శాస్త్రవేత్త రిపోర్ట్ అనంతరం కంపెనీల పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటానని, వాటిని బట్టి రైతులను ఆదుకుంటామని, వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపినామని, త్వరలోనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభి యాన్ మెగా హెల్త్ క్యాంప్

**కర్నూలు సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి**
(మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు) కార్యక్రమము లో బాగంగా కర్నూలు సర్వజన ఆసుపత్రిలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడమైనది.
ఈ కార్యక్రమానికి శ్రీమతి చరితారెడ్డి ఎమ్మెల్యే ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వ తేదీ వరకు రెండు వారాల పాటు స్వస్త్ నారి సశక్త్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా లోని అన్ని గ్రామీణ మరియు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక వైద్య సేవలు.మహిళల లో గుండె జబ్బులు, మధు మేహం, నోటి కాన్సర్ మరియు గర్భాశయ కాన్సర్ లను పరీక్షల ద్వారా తగిన వైద్య చికిత్స లను మరియు రెఫరల్ సేవలను



అందించడం జరుగుతుంది.
మహిళలు మరియు కిషోర బాలికలలో రక్త హీనత ను గుర్తించి తగిన చికిత్సలను చేయడం.బాలికలలో రక్తహీనత ను గుర్తించి తగిన చికిత్స చేయడం.గర్భవతుల ను పరిక్షించి సరైన పోషకాహారం ఆవశ్యకతను తీసుకోవల్సిన జాగ్రత్తల ను గురించి కౌన్సిలింగ్ నిర్వహించడం. కిశోర బాలికలలో హిమా గ్లోబిన్ పరీక్షలు చేయడం, రక్త హీనత కల వారికి చికిత్స చేయడం జరుగుతుంది. గర్భిణులకు ఎమ్ సి పి కార్డ్ లు అందజేయడం జరుగుతుంది.పిల్లల లో సికిల్ సెల్ అనీమియా గుర్తించి అవసరమైన వారికి చికిత్స చేయడం జరుగుతుంది. పిల్లలకు మరియు గర్భిణి స్త్రీలకు వ్యాధి నిరోధక టీకాలు అంద జేస్తారు.యుక్త వయస్సు బాలికలు మరియు మహిళల కు బహిస్టు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం జరుగుతుంది.రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందిఆయుష్మాన్ ఆరోగ్య కార్డులు అందించడం జరుగుతుంది. ప్రత్యేక అవగాహనా కార్య క్రమాలు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు . అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించి వివిధ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకొన్నారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు , జనరల్ సర్జరీ డాక్టర్ మాధవీలత, ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శాంతికళ , ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరు రామాంజనేయులు డి ఐ ఓడాక్టర్ ఉమ, డి ఎస్ ఓ డాక్టర్ నాగప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరి విన్సెంట్ జోయల్ పుట్టినరోజు వేడుకల్లో

# పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:**నంద్యాల టౌన్ 36 వార్డు లో గల 99 బూత్ కి ఇంచార్జి ఐన కల్లూరి సునీల్ కుమార్ కుమారుడు కల్లూరి విన్సెంట్ జోయల్ పుట్టినరోజు వేడుకలు నంద్యాల టీడీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొని కేక్ కట్ చేయించారు . ఈ కార్యక్రమంలో 36 వార్డు టిడిపి ఇంచార్జ్ మారుతి ప్రసాద్, టిడిపి నాయకులు శేఖర్ రెడ్డి, కల్లూరి అరుణ కుమారి, దేవన్ష్, రవి కుమార్, వినోద్ బాబు , బుగ్గ రాముడు తదితరులు పాల్గొన్నారు.

**ఇమామలకు , మౌజన్ లకు గౌరవ వేతనం చెల్లించాలి. మసీదులకుఖబ్రస్తాన్**

**ఈద్గాలను అభివృద్ధి చేయాలని మంత్రి ఫరూక్ కి వినతి పత్రం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:** పొద్దుటూరు పట్టణ ముస్లిం సోదరుల ఇమామలకు , మౌజన్ లకు గౌరవ వేతనం చెల్లించాలని, అలాగే మసీదులకు , ఖబ్రస్తాన్ , ఈద్గాలను అభివృద్ధి చేయాలని మరియు సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ నంద్యాల కార్యాలయం నందు 400 మంది ముస్లిం మైనార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ.. పొద్దుటూరు పట్టణ ముస్లిం సోదరుల సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అలాగే ఇమామలకు, మౌజన్ లకు గౌరవ వేతనం త్వరలోనే చెల్లిస్తామని మసీదులకు , ఖబ్రస్తాన్ ,ఈద్గాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. మంత్రి ఎన్ఎండి ఫరూక్ హామీ ఇవ్వడంతో పొద్దుటూరు పట్టణ ముస్లిం సోదరులు మంత్రి ఫరూక్ కి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 30 సెప్టెంబర్ 2025

# అర్జీల పరిష్కారంలో నాణ్యత తప్పనిసరి.

## పిజిఆర్ఎస్‌కు 263 దరఖాస్తులు. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 29:**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించే అర్జీల పరిష్కారంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, అర్జీదారులు సమర్పించిన ప్రతి అర్జీని జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న అంశాలను కూలంకషంగా పరిశీలించి, సరైన రీతిలో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. జిల్లాలో గత ఏడాది జూన్ 15 నుండి ఇప్పటి వరకు మొత్తం 43,143 అర్జీలు స్వీకరించబడ్డాయని, అందులో సరైన రీతిలో ఎండార్స్ చేయకపోవడం వల్ల 471 దరఖాస్తులు రీ%-%ఓపెన్ అయ్యాయని తెలిపారు. ప్రతి అధికారి రీ%-%ఓపెన్ అయిన దరఖాస్తులపై పూర్తి దృష్టి సారించి పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. ప్రస్తుతం నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాల్సిన 1,926 దరఖాస్తులు ఉన్నాయని, అందులో రెవెన్యూ %-%



1,038, సర్వే %-% 394, పోలీస్ %-% 130 తదితర శాఖల్లో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. గడువు ముగిసే వరకు వేచి చూడకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆడిట్‌లో లోపాలు గుర్తించిన ఫిర్యాదులను తప్పనిసరిగా రీ%-%ఓపెన్ చేసి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ఫీడ్బ్యాక్ సేకరణలో డోన్ రూరల్, గడివేముల, గోస్పాడు, జూపాడుబంగ్లా, మిడుతూరు, సంజామల, రుద్రవరం, పాములపాడు, వెలుగోడు తదితర 15 మండలాలు గత రెండు వారాలుగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని కలెక్టర్ గుర్తించారు. వెంటనే ఫీడ్బ్యాక్ సేకరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత మండల తహసీల్దారులను ఆదేశించారు.

1)బండి ఆత్మకూరు మండలం, బోజనం గ్రామానికి చెందిన సి. కుమారి %-% సర్వే నెం.244/ఎలో 1.5 ఎకరాల భూమిని 1983 నుండి సాగు చేసుకుంటున్నా, ఆన్‌లైన్ రికార్డుల్లో అది ప్రభుత్వ భూమిగా చూపుతుందని, దానిని పట్టా భూమిగా మార్చాలని కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.

2)నంద్యాల పట్టణానికి చెందిన వి. దివిజి %-% శ్రీనివాస నగర్‌లోని టిటిడి కళ్యాణ మండపం వద్ద అధిక వర్షాల వల్ల డ్రైనేజ్ గోడ కూలిపోవడంతో నీరు రోడ్లపైకి పొంగిపోతోందని, దీని వలన అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.

3) నంద్యాలకు చెందిన షేక్ ఇస్మాయిల్ %-% తాను ఇంతవరకు సొంత ఇల్లు లేకపోవడంతో ప్రభుత్వం తనకు ఇంటి స్థలం కేటాయించాలని అర్జీ సమర్పించుకున్నారు.

ఈ కార్యక్రమంలో మొత్తం 263 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు దరఖాస్తులు సమర్పించారు. అన్ని అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# స్త్రీ పథకంలో పరిశ్రమల కార్మికులు తప్పనిసరిగా నమోదు కావాలి.

## పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు కూడా అర్హులు. -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 29:**
జిల్లాలోని చిన్న పరిశ్రమల నుండి పెద్ద పరిశ్రమల వరకు పనిచేస్తున్న కార్మికులంతా స్త్రీ పథకం మరియు క్షమాభిక్ష పథకంలో తప్పనిసరిగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో జరిగిన సమావేశంలో ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, తిరుపతి డిప్యూటీ డైరెక్టర్ కృష్ణ కుమార్, సామాజిక భద్రతా పథకం యొక్క ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, వేతనం రూ.21 వేల లోపు ఉన్న ఉద్యోగులందరూ ఈ పథకంలో నమోదు అయ్యే అవకాశం ఉందన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతో పాటు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా ఈ పథకంలో భాగం కావచ్చని తెలిపారు. ఈ పథకంలో ఉద్యోగి వేతనం నుండి 0.75%, పరిశ్రమ యాజమాన్యం నుండి 3.25% చెల్లించాల్సి ఉంటుందని




వివరించారు. ఈ పథకం కింద ఉద్యోగి అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నప్పటికీ వేతనం చెల్లింపుతో పాటు అవసరమైన అన్ని వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించనుందని కలెక్టర్ తెలిపారు. అలాగే మహిళా ఉద్యోగుల కోసం ప్రసూతి ప్రయోజనం కింద గరిష్టంగా 26 వారాల పాటు 100 శాతం సగటు రోజువారీ వేతనం చెల్లింపు జరుగుతుందని తెలిపారు. పనికి సంబంధించిన గాయం లేదా అనారోగ్యం కారణంగా తాత్కాలికంగా లేదా శాశ్వతంగా వైకల్యం ఏర్పడిన సందర్భంలో అశక్తత ప్రయోజనం రూపంలో నెలవారీ చెల్లింపు లభిస్తుందని వివరించారు. ఉద్యోగి మరణించినప్పుడు అతని ఆధారితులకు నెలవారీ పింఛన్ రూపంలో ఆర్థిక సహాయం అందించే సదుపాయం కూడా ఈ పథకం కింద ఉన్నదని కలెక్టర్ స్పష్టం చేశారు. అదే విధంగా, పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు సంవత్సరానికి రూ.120/- రుసుము చెల్లించి వైద్య సదుపాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. కుటుంబంలో అమ్మాయి ఉంటే వివాహం అయ్యేంత వరకు, అబ్బాయి ఉంటే 21 ఏళ్ల వయసు వరకు వారికి కూడా ఈ వైద్య సదుపాయాలు లభిస్తాయని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 8 శాతం మంది మాత్రమే ఈ పథకంలో నమోదు అయ్యారని, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది సహా అందరూ నమోదు అయ్యేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

# మత్తు పదార్థాల నియంత్రణపై గట్టి నిఘా ఉండాలి.

**మహిళ రక్షణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.**

**ఐడి లిక్కర్ ఫ్రీగా జిల్లాను తీర్చిదిద్దాం.**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబరు, 29:**
మత్తు పదార్థాల నియంత్రణపై గట్టి నిఘా ఉంచి వాటి నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణపై "డ్రగ్స్ వద్దు బ్రో" అనే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో నంద్యాల ఎఎస్పీ మంద జావాలి అల్ఫోన్స్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ.... జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణపై గట్టి నిఘా ఉంచి జిల్లాను మత్తు పదార్థాల లేని జిల్లాగా తీర్చిదిద్దేలా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పది, ఇంటర్మీడియట్, డిగ్రీ తప్పిపోయిన విద్యార్థులపై పక్కగా దృష్టి సారించాలన్నారు. అందుకు గాను ప్రభుత్వం జిల్లాలో మత్తు పదార్థాల లభ్యత ఏమైనా ఉందా ? మహిళల పట్ల పోలీసులు ఏ విధంగా స్పందిస్తున్నారు ? తదితర అంశాలపై పబ్లిక్ పర్సెప్షన్ ఆధారంగా ఫీడ్ బ్యాక్ తీసుకొని జిల్లాకు ర్యాంకింగ్ ఇవ్వడం జరుగుతోందన్నారు. పబ్లిక్ పర్సెప్షన్ ను ఐవిఆర్ఎస్, క్యూఆర్ కోడ్, వాట్సాప్ గవర్నర్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించడం జరుగుతోందన్నారు. అందుకు ప్రజలకు ఉత్తమ సేవలు అందజేసేలా చర్యలు






తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాల నివారణ కోసం పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు బోధిస్తూ జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలల్లో, ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా ప్రతి నెలలో సమావేశాలు నిర్వహించేలా చూడాలన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల నుండి విముక్తి పొందడం కోసం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో డిఅడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా గృహిణులు ఇంటి ముందు కళ్ళాపి కోసం ఉపయోగించే సౌభాగ్య పౌడర్ ప్రజలకు అందుబాటులో లేకుండా చూడాలన్నారు. జిల్లాలో అత్యధికంగా శైవ క్షేత్రాలు ఉన్న నేపథ్యంలో అక్కడే నివాసం ఏర్పాటు చేసుకున్న సాధువులపై నిఘా ఉంచాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. అదే విధంగా అంతర పంటలు మధ్యలో గంజా పంట వేయకుండా చూడాలని హార్టికల్చర్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.జిల్లాను ఐడి (ఇల్లీసిట్లీ డిస్టిల్డ్ లిక్కర్)ఫ్రీగా జిల్లాను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అదే విధంగా పోలీసు సహకారంతో భవిష్యత్తులో మళ్లీ మద్యం ఉత్పాదకత ఉండకుండా కృషి చేయాలన్నారు. నంద్యాల ఎఎస్పీ మంద జావాలి అల్ఫోన్స్ మాట్లాడుతూ....2025వ సంవత్సరంలో ఇప్పటి వరకు 11 కేసులు నమోదు అవ్వడంతో పాటు సుమారు 17 కిలోలు సీజ్ చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా పాఠశాలల వంద మీటర్ల పరిధిలో నో స్మోకింగ్ జోన్ గా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి విద్యా సంస్థలో ఈగల్, శక్తి టీమ్స్ ఏర్పాటు చేసి వాటి ద్వారా యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. మత్తు పదార్థాల నివారణ కోసం 1972 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఔషధ దుకాణాలు ప్రిస్క్రిప్షన్ లేకుండా పెయిన్ కిల్లర్స్ విక్రయించకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కు నివేదించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ మత్తు పదార్థాల వినియోగిస్తే, సరఫరా చేస్తే అందుకు అమలు చేసే శిక్షలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.అనంతరం మత్తు పదార్థాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్స్ పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

# గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలి.

**మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని.**

**ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 29:**
గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేసేలా చర్యలు చేపట్టాలని మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని పేర్కొన్నారు. సోమవారం మహానంది మండలం తిమ్మాపురంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్య క్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మహానంది మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు.రాజకీయాలకు




అతీతంగా ప్రజల భాగస్వామ్యంతో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. అధికారులు విధుల్లో సమయపాలన పాటించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజా ప్రతినిధులు,అధికారుల సమన్వయం చేసుకొని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలన్నారు.గ్రామాలలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై సర్పంచులు, ఎంపిటిసిలు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ, జడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీవో మహబూబ్ దౌలా, డిఆర్ఓ హైమావతి, విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకరరెడ్డి, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి, మహానంది ఏఎస్సై మోలాలి , డాక్టర్ కరుణాకర్, హౌసింగ్ ఏ ఈ షఫీ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్టి యాప్‌లో రిజిస్ట్రేషన్ తక్షణమే పూర్తి చేయాలి.

## జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 29:**
జీఎస్టీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ ముందుగా జిఎస్టి యాప్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం ఆయన మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై సమీక్ష



నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ రేట్లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సందర్శించిన ఇళ్ల వివరాలు, ఫోటోలను యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు సమావేశాలు నిర్వహించి పక్కా ప్రణాళిక రూపొందించుకుని అవగాహన కార్యక్రమాలను అమలు చేయాలని ఆయన సూచించారు. ఈనెల 25వ తేదీ నుండి ప్రారంభమైన శాఖల వారీ షెడ్యూల్‌ను వచ్చే నెల 19వ తేదీ వరకు కొనసాగించాలని పేర్కొన్నారు. మొదటి వారం సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 1 వరకు మెప్మా, గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామస్థాయిలో ఆర్పీలు, ఏపిఎంలు, సిసిలకు అవగాహన కల్పించడంతో పాటు గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. రెండవ వారం అక్టోబర్ 2 నుండి 8 వరకు వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ట్రాక్టర్ ర్యాలీల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని, పరిశ్రమలు, చేనేత శాఖలు వర్క్‌షాప్‌లు నిర్వహించాలని సూచించారు. మూడవ వారం అక్టోబర్ 9 నుండి 15 వరకు మున్సిపల్, పంచాయతీ రాజ్, సాంఘిక సంక్షేమ శాఖల ద్వారా ప్రచారం చేయడంతో పాటు విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ఆసుపత్రుల పరిధిలో జీఎస్టీ 2.0పై అవగాహన మేళాలను డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఎస్, జిజిహెచ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో జరగాలని ఆదేశించారు. నాలుగవ వారం అక్టోబర్ 16 నుండి 19 వరకు టూరిజం, రవాణా, విద్యుత్ శాఖలు ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు.అనంతరం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ద్వారా వినియోగదారులకు లభించే ప్రయోజనాలను వివరించే కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే జిల్లా వాటర్ బులెటిన్ కూడా ఆవిష్కరించారు.

# ప్రజా ఫిర్యాదులను విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం చేస్తాం.

## - నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ సెప్టెంబర్ 29:**
నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఫిర్యాదిదారుల నుంచి 76 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే



పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఆదేశించారు.ఈ ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేయడం, పొలం తగాదాలు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు మొదలగునవి ఉన్నాయి.1). మా ఇంటికి రస్తా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ, బెదిరిస్తూ దాడులు చేస్తున్నాడని, మేము కోర్టు నుండి రాస్తా మాదేనని జడ్జిమెంట్ కాగితాలు ఉన్నా కూడా ఇబ్బంది పెడుతున్నాడని మాకు న్యాయం చేయండని చాగలమర్రి మండలం మద్దూరు గ్రామానికి చెందిన చిన్న పుల్లయ్య జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.2).మా నాన్నగారు 2000 సంవత్సరంలో 1.20 సెంట్లు స్థలం కొన్నారు.మా అనుభవంలోని పొలంని సాగు చేసుకోవడానికి వెళ్తుంటే వడ్డే .వెంకటేశ్వర్లు మరియు శ్రీనివాసులు అనువారు దౌర్జన్యంగా పొలంలోకి వెళ్లకుండా అడ్డుపడుతున్నారని మాకు న్యాయం చేయండని డోన్ మండలం కొత్తచెరువు గ్రామానికి చెందిన రామకృష్ణ రాజేశ్వరి ,మహాలక్ష్మి అనువారు జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు. 3).మాకు ఆళ్లగడ్డ తాలూక దేవరాయపురం గ్రామం నందు 2.60 సెంట్లు భూమి కలదు. సదరు కులమునకు నీళ్లు రాకుండా పంట కాలువను చేయనీయకుండా బెజవాడ సుబ్బారావు మరికొందరు అడ్డుపడుతూ దౌర్జన్యాలు చేస్తున్నారని నాకు న్యాయం చేయండని నంద్యాలకు చెందిన లక్ష్మీ చౌడేశ్వరి జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు.

## సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి. -ఎస్ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి.

**ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 29:**
మద్యం సేవించి వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని మహానంది ఎస్ఐ ఎన్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం మహానంది మండలం బోయలకుంట్ల మెట్టలోని గాజులపల్లె- నంద్యాల జాతీయ రహదారిలో ముమ్మరంగా వాహనాల



తనిఖీలు నిర్వహించారు. సరైన ధృవపత్రాలు, హెల్మెట్, లైసెన్స్ లేని పలువురికి జరిమానాలు విధించారు. ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు, జైలు శిక్ష పడుతుందన్నారు. వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించి, వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, లైసెన్సులు కలిగి ఉండాలని,ఫోర్ వీల్ వాహనదారులు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని, లేని యెడల జరిమానాలు విధిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహానంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహానంది పుణ్యక్షేత్రంలో ఆర్ జె సి పూజలు.

**ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 29:**
మహానంది పుణ్యక్షేత్రంలో తిరుపతి ఆర్ జె సీ దేవదాయ ధర్మదాయ శాఖ మల్టీజోన్ -2 ఎస్ .ఎస్ .చంద్రశేఖర్ ఆజాద్ కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. సోమవారం వీరికి ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం ఈవో శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారికి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులు రవిశంకర అవధాని వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక


# పారిశుద్ధ్య కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం..!

**పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి.**
**కార్మికులంతా తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి.**
**సఫాయి మిత్ర సురక్ష శివిర్ వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారితో కలిసి ప్రారంభించిన రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్.**

















**ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబరు 29:** గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పరిశుభ్రత విషయంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమూల్యమని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ అన్నారు. సోమవారం నంద్యాల పురపాలక సంఘం పరిధిలోని పారిశుద్ధ్య కార్మికుల కోసం సఫాయి మిత్ర సురక్ష శివిర్ కార్యక్రమంలో భాగంగా శాంతిరాం జనరల్ ఆస్పత్రి, వైద్య కళాశాల సహకారంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికులు ఎల్లప్పుడూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీధుల శుభ్రత, మురుగు కాలువలలో చెత్త తొలగింపు, ప్రమాదకర వ్యర్థాల పారవేత వంటి పనుల సమయంలో రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ అవసరమైన అన్ని రకాల సహాయం అందిస్తోందని తెలిపారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు అందజేస్తున్నామని, భవిష్యత్తులో కూడా క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని జిల్లా ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత 15 రోజులుగా స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినందుకు శాంతిరామ్ మెడికల్ కళాశాల, ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ధన్యవాదాలు తెలిపారు. మహిళా పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని ఆమె అన్నారు. ఇంటిలో శుభ్రం చేసుకున్న చెత్తను రోడ్లపై, కాలువల్లో, ఖాళీ ప్రదేశాల్లో పారేయడం వల్ల పారిశుద్ధ్య సిబ్బంది మళ్లీ శ్రమించి పరిశుభ్రం చేయాల్సి వస్తోందని కలెక్టర్ గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఆస్పత్రులను తమవిగా భావించి పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత తీసుకోవాలని ప్రజలను కోరారు. అలాగే సిబ్బంది ప్రభుత్వం అందజేస్తున్న గ్లౌజులు, మాస్కులు వంటి రక్షణ పరికరాలు తప్పనిసరిగా వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఎవరూ మొహమాటపడకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన మందులు పొందాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులతో పాటు బీపీ, షుగర్, కార్డియాక్ అరెస్ట్, డయేరియా, క్యాన్సర్ వంటి వ్యాధులు తెలియకుండా వచ్చే అవకాశం ఉండటంతో నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వెంకటరమణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. అంకిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, సిబ్బంది, కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

**- పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి,**







**ఆంధ్ర ప్రగతి ఓర్వకల్లు సెప్టెంబర్ 29:**
ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామంలో అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పత్తి సేన్లు..నష్ట పోయిన పత్తి రైతులను పరామర్శించి పత్తి మరియు పొగాకు రైతులకు నష్ట పరిహారం తక్షణమే కూటమి ప్రభుత్వ చెల్లించాలి అంటూ డిమాండ్ చేసిన వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి,
అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.
మండలంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న ఉల్లి, పత్తి పంటలను పరిశీలించారు.
రైతుల పొలాల్లో నీటిముగ్గులో కూరుకుపోయిన పంటలు, కూలిపోయిన మొక్కలు, పాడైపోయిన పంటల స్థితిని రైతులు స్వయంగా ఆయనకు వివరించారు.
రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న అయన ప్రభుత్వ తీరును ఎండగట్టిన కాటసాని రాంభూపాల్ రెడ్డి గారు..
కాటసాని రాంభూపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..
ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.
పంట పొలాల్లో నీరు ఉండడం ఈ వర్షానికి పత్తి కాయలు బూజు పట్టి కూలిపోయాయి రైతుకు ఏ విధంగా కూడా న్యాయం జరగని పరిస్థితి,
రైతులకు ఎరువులు, విత్తనాలు, సాగు కోసం అవసరమైన ఇతర వస్తువులు అందించడా తక్షణ సహాయ చర్యలు తీసుకోవడం ద్వారా రైతులు భవిష్యత్తులో వ్యవసాయ కార్యకలాపాలను సక్రమంగా కొనసాగించగలరని అన్నారు.
అదే మా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో క్రాఫ్ఇన్సూరెన్స్ కింద ఆర్ బి కి సెంటర్లలో ప్రతి ఒక్క రైతు ఒక్క రూపాయి కడితే వారి భూములు కూడా ఇన్సూరెన్స్ ఇచ్చిన ఘనత మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి ది అని రైతులందరూ మర్చిపోవద్దు అని విజ్ఞప్తి చేస్తున్నాను. తెలుగుదేశం నాయకుడు మాట్లాడుతున్నారు వైసిపి వాళ్లకు పని లేక తిరుగుతున్నారు అని. తెలుగుదేశం నాయకులను ఒకటే కోరుతున్నాను. మిమ్మల్ని నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు మిమ్మల్ని నమ్మి ఓట్లు వేసిన రైతులకు న్యాయం చేయండి. మీరు ఒక్కసారి రైతుల ముందరికి రండి పోదాం.. ఐదు సంవత్సరాలు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతులు ఏవిధంగా ఉన్నారు.. తెలుగుదేశం ప్రభుత్వం అధికారం వచ్చిన సంవత్సరం నరలో రైతులు పరిస్థితి ఏందో చూడండి..మీరు ఏ గ్రామము మీరే చెప్పండి అదే గ్రామంలోకి పోదాం రైతులతో మాట్లాడుదాం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బాగుందా రైతులకు తెలుగుదేశం గవర్నమెంట్ బాగుందా చెప్తే మీరు చెప్పినట్టు రైతులు తెలుగుదేశం ప్రభుత్వం బాగుందని చెప్తే మీకు ఫుడ్ దగ్గర అసలు చెప్తాం.
ఒకసారి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏ దానికి రేటు లేకపోతే టమోటా మరియు ఉల్లి కూడా కేజీ ?100 అమ్మిన పరిస్థితి సామాన్య ప్రజలు అన్యాయం అయిపోతారు అని ఉల్లి ఎంత రేటు పెట్టి కొనలేరు అని రైతు బజార్లలో మొత్తం సబ్సిడీ రేట్లు ఇప్పించిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డి,
తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక యూరియా దొరకడం లేదు.
తెలుగుదేశం నాయకులకు మీరు ఏది చెప్తే అది రాసే మీడియా పత్రికలు మీ చేతిలో ఉన్నాయనుకుంటే మీడియా మేనేజ్మెంట్ ను కోరుకునేది ఒకటే నిజ నిజాలు రాయండి ప్రజల్లోకి రండి రైతుల విషయాలు ఒకసారి ఆలోచించండి రైతులకు ఏ అన్యం జరిగింది అనేది చూడండి.మార్కెట్ యార్డులలో చూస్తే 300, 400 రూపాయలు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. దానికి వాళ్లకు కమిషన్ వసూలు చేయడం మొత్తం 1200 కూడా నాలుగు పర్సెంట్ పెట్టి 2% అంటే ఏ విధంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారో చూడండి.
తెలుగుదేశం ప్రభుత్వంలో వడ్లు ఎవ్వరు కూడా కొనలేని పరిస్థితి ఆరోజు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 2000 నుంచి 2500 రూపాయలు అమ్మిన పరిస్థితి ఉంది.
రైతు ఏ విధంగా బతకగలడు ఒకసారి ఆలోచించండి రైతు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది తప్ప. రైతు కడుపు కాలీ రైతు ఆక్రోషపడి మాకు ఏంది ఈ పరిస్థితి అని రైతు ఆలోచన చేస్తే మా రాష్ట్రం కానీ మన దేశం కానీ బాగుపడదు..
వ్యవసాయం దండగ అనుకుంటే మాత్రం వ్యవసాయం లేకపోతే మన పుట్టిన దానికి తిండి గింజలు లేని పరిస్థితి వస్తుంది అటువంటి రైతులను ఆదుకోవాలి. 16వ తారీకు కర్నూలు జిల్లాకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ గారు వస్తున్నారు.. కాబట్టి ఒకసారి నరేంద్ర మోడీ గారికి కూడా ఈ యొక్క గ్రామాల రైతుల పరిస్థితి రైతులకు జరుగుతున్న అన్యాయం చూడాలని విజ్ఞప్తి చేస్తున్నాం.
రైతులకు ధైర్యం కల్పిస్తూ, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందన్నారు.రైతుల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు.
ఈ కార్యక్రమంలో హుసేనాపురం గ్రామం రైతులు మరియు ఓర్వకల్లు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులను 50 సం!! నిండిన వారిని తొలగించరాదు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 29:** నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నటువంటి శానిటేషన్ కార్మికులకు వయసు 50 సంవత్సరాలు దాటిన వాళ్లను ఉద్యోగాల నుంచి తీసేస్తామని కాంట్రాక్టర్లు బెదిరించడం అన్యాయం అని ప్రభుత్వమే 60 సంవత్సరాలు వయోపరిమితి పెంచింది, కానీ కాంట్రాక్టర్లు మాత్రం ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా శానిటేషన్ కార్మికులను బెదిరింపులకు గురి చేయడం చాలా అన్యాయమని 50 సంవత్సరాల ఉన్న వాళ్లను తీసివేస్తామని ధోరణిని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి వెన్న ,బాల వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వమే ఉద్యోగులకు 60 సంవత్సరాలు పెంచిన విషయం కాంట్రాక్టర్లకు తెలియదా దాదాపు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటేషన్ కార్మికులుగా 15, 20 సంవత్సరాలు నుంచి పనిచేస్తున్న కార్మికులను 50 సంవత్సరాలు నిండినాయి అనే నేపంతో తొలగించడం దుర్మార్గమైన చర్యగా ఉందని ఇలాంటి ప్రయత్నాలు విరమించుకోకపోతే సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులను అంత కలిపి జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ %జ×ుఖ% నాయకురాళు చిన్నమ్మ రాజమ్మ వెంకటేశ్వరమ్మ సులోచన సునీత హరిప్రియ ఏ లక్ష్మీదేవి మంగమ్మ నీలావతి తో పాటు శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

# జిల్లా విద్యాశాఖ అధికారి విద్యార్హతలపై జ్యాడిషియల్ విచారణ చేయాలి- ఏబీవీపీ



**కర్నూలు, సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి:-** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కర్నూలు శాఖ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామలపాల్ పై ఉన్నటువంటి విద్యా అర్హతలపై స్పష్టతను కోరుతూ జిల్లా కలెక్టర్ డా. అట్టాడ సిరి ని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో అనేక విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు అనార్హులై నటువంటి వ్యక్తులను నియమించారంటూ ఆందోళనలు చేస్తున్నటువంటి సందర్భంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఆదేశాలు మేరకు విచారను గత నెల రోజులు క్రితం నుంచి ఇప్పటివరకు విద్యాధికారులు విచారణ చేయలేదు కావున అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నుంచి మేము జ్యుడీషియల్ ఎంక్వయిరీనీ వేసి త్వరితగతను పూర్తి చేసి డిఈవో బీఈడీ విద్యార్హత పొందిన విధానంపై సమగ్రంగా నిష్పాక్షపాతంగా విచారణ చేసి వాస్తవాలను బహిర్గతం చేసి జిల్లా విద్యాశాఖకు ఉన్నటువంటి గౌరవ ప్రతిష్టను కాపాడాలని కర్నూలు విభాగ్ కన్వీనర్ ఎర్రి స్వామి, కిరణ్, శివ, తదితర కార్యకర్తలు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

# ఆపరేషన్ ఆసియా కప్ అదరహో !

**సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి**
ఆపరేషన్ సిందూర్ అంత ఆనందం..ఆసియాకప్‌లో భారత్ విజయఢంకా మోగించడంతో దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా మరోమారు ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. ప్రధాన పట్టణాలు మొదలుకుని ప ల్లెల వరకు ప్రజలంతా ముఖ్యంగా క్రికెట్ అభిమానులు టీవీలకు అతుక్కుపోయి కూర్చున్నారు. చాలాకాలం తరవాత పాక్‌తో క్రికెట్ ఆడడంతో ప్రజల్లో ఎక్కడ లేని ఉత్సాహం నెలకొంది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ పాక్‌పై దాడులు జరుగుతుంటే సైతం ప్రజలు టీవీలకు అతుక్కుపోయారు. ఎప్పటికప్పుడు
విశేషాలు తెలుసుకున్నారు. మన సైనికుల పోరాటాన్ని గురించి తెలుసుకున్నారు. విమానదాడులు జరుగుతుంటే ఆనందించారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రస్థావరాలపై దాడులను ఆనందించారు. ఇప్పుడు మళ్లీ క్రికెట్‌లో పాక్ ప్రత్యర్థి కావడంతో అంతే ఆనందంతో మునిగిపోయారు. బ్యాటింగ్, బౌలింగ్ అంతటా మనవాళ్లు ఆధిపత్యం ప్రదర్శించడాన్ని ఎంజయ్ చేశారు. పాకిస్థాన్‌పై అదిరే విజయం సాధించి భారత్ ఆసియా కప్ విజేతగా నిలిచింది. ఉత్కంఠగా సాగిన్గ ÷నైల్ పోరులో దాయాది జట్టుపై టీమ్‌ఇండియా 5 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత బౌలర్లు విజృంభించడంతో పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మ్యాచ్‌లో భారత ఆటగాళ్లు తమదైన శైలిలో విజృంభించి పాక్‌కు చెమటలు పట్టించారు. ఈ క్రమంలో టీమ్‌ఇండియా ఆసియాకప్ 2025 విజేతగా నిలిచింది. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మన చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆత్మవిశ్వాసమే బ్రహ్మాస్త్రంగా చేసుకొన్న భారత క్రికెటర్లు కఠిన పరిస్థితుల్లోను పాక్‌ను సులభంగా ఓడించారు. మ్యాచ్ ప్రారంభంలో ప్రత్యర్థి ఓపెనర్ల దూకుడును మన బౌలర్లు చూసినప్పటికీ.. ఎటువంటి ఆందోళన లేకుండా ఏకాగ్రతతో వారిని కుప్పకూల్చారు. బ్యాటింగ్ సమయంలో క్రికెటర్లు మన టాప్ బ్యాటర్లు త్వరగా ఔటవడాన్ని చూశారు. అయినా ఏమాత్రం వెనకడుగు వేయకుండా తమ ఉక్కు సంకల్పంతో ప్రశాంతంగా, ఓపిగ్గా లక్ష్య ఛేదన పూర్తి చేశారు. పాకిస్థాన్‌ను ఫైనల్‌లో చిత్తు చేసిన టీమ్‌ఇండియా తొమ్మిదోసారి ఆసియా కప్ ఛాంపియన్‌గా నిలవడంతో దేశం మొత్తం సంబరాల్లో మునిగిపోయింది. టాస్ గెలిచిన భారత జట్టు మొదట బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ జట్టు 19.1 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసింది. ఇలా ఓవరాల్‌గా తొమ్మిదోసారి ఆసియాకప్‌ను టీమ్‌ఇండియా కైవసం చేసుకుంది. ఏడుసార్లు వన్డే



ఫార్మాట్లో, రెండుసార్లు టీ20 ఫార్మాట్లో ఈ టోర్నీలో విజయం సాధించి చరిత్ర సృష్టించింది. ఈ నేపథ్యంలో పలువురు ప్రముఖులు, మాజీలు టీమ్‌ఇండియాకు సోషల్ మీడియా వేదికగా తమ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అదే సమయంలో రాత్రి అంతటా బాణాసంచా కాల్చి ఎంజాయ్ చేశారు. టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ 'ఎక్స్' వేదికగా భారతజట్టును అభినందించాడు. 'వెల్ డన్ ఇండియా. ఒత్తిడిలో భారత జట్టు మొదట బంతితో తర్వాత బ్యాట్‌తో రాణించింది. భారత యువ క్రికెటర్లు అద్భుతం' అని అన్నాడు. టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్.. ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌కు సంబంధించి మూడు పోస్ట్‌లు పెట్టాడు. 'వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌లు మ్యాచ్ విన్నర్లు. వీరు మిడిల్ ఓవర్లలో చక్కగా బౌలింగ్ చేశారు' 'పాకిస్థాన్ తన ఎనిమిది వికెట్లను భారత స్పిన్నర్లకు సమర్పించుకుంది' 'తిలక్ వర్మలో చాలా నైపుణ్యముంది. అతడి టెక్నిక్ బాగుంది. అతడు క్రీజులో చివరివరకు ఉండి.. ఫైనల్‌లో పాకిస్థాన్‌పై టీమ్ ఇండియా నెగ్గేలా చేశాడు. అతడు చాలా మెరుగయ్యాడు.
నిలకడగా కూడా రాణించాడు. ఆసియా కప్ 2025ను టీమ్‌ఇండియా కైవసం చేసుకోవడంపై బీసీసీ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా స్పందించారు. 'ఆసియాలో ఓటమి ఎరుగని విజేత. పాకిస్థాన్‌పై 3-0తో గెలిచిన టీమ్‌ఇండియాకు అభినందనలు వెల్లువెత్తాయి. తిలక్‌వర్మ, కుల్‌దీప్ ఒత్తిడిలోనూ అద్భుతంగా రాణించారు.భారత జట్టు విజయంపై ఐసీసీ ఛైర్మన్ జైషా ఎక్స్‌లో తన స్పందనను తెలిపారు. 'ఆసియా కప్ 2025ను గెలుచుకున్న టీమ్‌ఇండియాకు అభినందనలు. ఇండియన్ క్రికెట్‌లో ఇది గర్వించదగ్గ క్షణం. భారతజట్టు ప్రదర్శన అత్యద్భుతం. ఈ టోర్నీలో టీమ్‌ఇండియా నిలకడగా రాణించింది. ఆటగాళ్లు, సహాయ సిబ్బందికి అభినందనలు వెల్లువెత్తాయి. టీమ్‌ఇండియా తొమ్మిదోసారి ఆసియా కప్ ఛాంపియన్‌గా నిలవడంపై ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా , కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ హర్షం వ్యక్తంచేశారు. పాక్‌పై భారత్ విజయం సాధించిన తీరుని ఆనంద్ మహీంద్రా ప్రశంసించారు. ఈక్రమంలో ఆసియా కప్‌పై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. విజయాల సంబరాల్లో మునిగి అందరూ క్రికెటర్లను ప్రశంసిస్తున్నారే తప్ప.. ఎవరూ తెర వెనక కృషిని పట్టించుకోవట్లేదని విచారం వ్యక్తంచేశారు. తరచూ జట్టు కోసం నిందలు పడే కోచ్ గంభీర్, టీమ్‌ను ఎంపిక చేసిన సెలక్టర్ల ను అభినందించాలన్నారు. జట్టు తప్పు చేస్తే ఎప్పుడూ వారే నిందలు పడతారని.. అదే టీం విజయం సాధించినప్పుడు మాత్రం ఎవరూ వారిని పట్టించుకోరని పేర్కొన్నారు. ఈసారి అన్నీ పక్కాగా చేసినందుకు కోచ్‌ను, సెలక్టర్లను అభినందిద్దాం అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# సద్దుల బతుకమ్మ వేడుకలు

## పల్లెలతో సహా పట్టణాల్లో ఆనందోత్సాహం

హైదరాబాద్ **సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి**
సద్దులబతుకమ్మపై తెలంగాణ అంతటా గందరగోళం ఏర్పడింది. ఏ రోజు జరుపుకోవాలన్న సందిగ్ధత ఏర్పాడింది. చివరకు 9 రోజులు అయితే సోమవారం, గౌరమ్మను పంపించే వ్యవహారంతో సంబంధం లేకుండా మంగళవారం, మధ్యే మార్గంగా కొన్నిచోట్ల బుధవారం జరుపుకోవాలని నిర్ణయించారు. ఈ యేడు ఒక్కోచోట ఒక్కోరోజు సద్దుల బతుకమ్మ నిర్వహించడం గమనార్హం. మొత్తంగా తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండగ తుది అంకానికి చేరింది. సద్దుల బతుకమ్మతో బతుకమ్మ సంబరాలు ముగియనున్నాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా వరదలు ముంచెత్తడడంతో హైదరాబాద్ తదిర ప్రాంతాల్లో బతుకమ్మ కళ తప్పింది. ఊరూవాడా వారం రోజులుగా బతుకమ్మ పండగ జోరుగా సాగాల్సి ఉన్నా వర్షాల భయంభయంగా ఆడపడచులు బతుకమ్మను ఆడిపాడారు. ఆడపడుచుల రాకతో గ్రామాలు కళకళలాడాల్సి ఉన్నా ఎక్కడా పెద్దగా సందడి కానరాలేదు. గతంలో సద్దుల బతుకమ్మ వేడుకలుకు పల్లెలు మొదలు పట్టణాల వరకు ముస్తాబయ్యేయి. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా బతుకమ్మను నిర్వహించేవారు. సిద్దిపేట, వరగంల్ తదితర పట్టణాల్లో వేడుకలను ఘనంగా
నిర్వహిస్తారు. ప్రకృతి రమణీయకతకు బతుకమ్మ నిదర్శనం. ఆశ్వయుజ మాసం శుద్ధ పాఢ్యమి నుంచి తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను వేడుకగా జరుపుకుంటారు. రంగురంగుల పూలను త్రికోణాకృతిలో పేర్చి, అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు కొడుతూ..ఆడి, పాడతారు. అప్పుడు మహిళలు పాడే పాటలు మనసుకు హత్తుకుంటాయి. ఏరోజు ప్రత్యేకత ఆ రోజుదే. ఇలా తొమ్మిది రోజులు



ఆడిన బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసి, నైవేద్యంగా పెట్టిన ప్రసాదాన్ని ఆడపడుచులంతా పంచు కుంటారు. తొమ్మిదో రోజు వేడుకగా సద్దుల బతుకమ్మను నిర్వహించి గౌరీదేవిని సాగనంపుతారు. ఇదో రకంగా గౌరీపూజను చేయడం.. అమ్మవారికి దసరా ముందు శరన్నవరాత్రులు ఎలా జరుపుతామో తెలంగాణాలో 9రోజులపాటు బతుకమ్మ వేడుకలను అలా జరుపడం ఆనవాయితీ. ఈ 9 రోజుల్లో కూడా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలంతా గుమిగూడా ఆడుకోవడం...ఆడపిల్లలను ఇంటికి రప్పించి వేడుక చేయడం పెద్ద సరదా. రంగురంగుల పుష్ప సౌందర్యాల హంగులతో సింగారించుకొనే బంగారు కల్పవల్లిగా బతుకమ్మను తెలంగాణవాసులు భావిస్తారు. ఓ పళ్లెంలో గుమ్మడి ఆకులు పరచి, వాటిని పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. ముందుగా గుమ్మడి పువ్వుల్ని అమర్చి- అక్కడే తంగేడు, బీర, గన్నేరు, నిత్య మల్లె, బంతి వంటి పుష్పాల్నిపేర్చి కూర్చడం కళాత్మకంగా చేస్తారు. అదే పువ్వుల దొంతరపై తమలపాకులో పసుపు గౌరమ్మను అలంకరిస్తారు. ఆ పుష్ప సముదాయాన్నే బతుకమ్మగా వ్యవహరిస్తారు. మహిళలు లయాత్మకంగా అడుగులు వేస్తూ, చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. బతుకమ్మ ఆవిర్భావం, గౌరీదేవి లీలలు, సామాజిక జీవన రీతులు, కుటుంబాల అనుబంధాలు, పురాణగాథలు, ఇతిహాస ఘట్టాల్ని వారు పాటల రూపంలో ఆలపిస్తారు. పసుపుబొట్టు పేరిట తాంబూలాలు ఇచ్చి పుచ్చుకొంటారు. బతుకమ్మను పసుపు, కుంకుమలతో ఆరాధించి వివిధ రకాల పదార్థాల్ని నివేదన చేస్తారు. ఆటపాటల అనంతరం, ప్రతి నిత్యం జలాశయాల్లో నిమజ్జనం చేయడం ఈ సంప్రదాయంలో ఒక భాగం. ప్రకృతి స్వరూపిణిగా అమ్మవారిని భావించి, వివిధ పుష్పాలతో పేర్చి 'బతుకమ్మ'గా ఆరాధిస్తారు. పూలతో బతుకమ్మ ఆవిర్భవించడం, ఆటపాటలతో అలరింతగా వేడుక చేయడం, నిమజ్జనంతో అనంత ప్రకృతిలో సంలీనం కావడం అనేవి- జగన్మాత సృష్టి, స్థితి, లయాత్మక తత్వాలకు సంకేతాలుగా భావించాలి. మహాలయ అమావాస్య నుంచి మహర్నవమి వరకు సాగే ఈ ఉత్సవం తెలంగాణ సాంస్కృతిక సౌరభాల్ని వెదజల్లుతుంది. అందుకే మన జీవన విధానం, సామాజిక ఏకత్వానికి మన పండుగలు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండగలో ప్రకృతి ఆరాధనతో పాటు కుటుంబ కట్టుబాటు, ఆచారాలు ఇమిడి ఉన్నాయి. ఆటపాటల నేపథ్యంగా, నిత్య జీవన రీతికి అనుగుణంగా ఈ సంబరాల్ని కొనసాగించారు. తొమ్మిది రోజులూ గౌరీదేవి పుట్టింటికి తరలి వచ్చినట్లు భావిస్తారు. తమ ఇంటి ఆడబిడ్డగా బతుకమ్మను భావిస్తూ, ఆరాధన చేస్తారు. తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మకు సాగనంపు వేడుక నిర్వహించడం సద్దుల బతుకమ్మ ప్రత్యేకత.

# సరవస్వతీ దేవిగా కనకదుర్గమ్మ

## ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

విజయవాడ, **'సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి**
ఇంద్రకీలాద్రిపై 2025 దసరా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతు న్నాయి. 'మూలా నక్షత్రం' కావడంతో సోమవారం సరస్వతీ దేవి అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి అర్థ రాత్రి నుంచే భక్తులను అనుమతించారు. దీంతో క్యూలైన్లన్నీ నిండిపోయాయి. అమ్మవారి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. వినాయక గుడి నుంచి సుమారు 3 కిమీ మేర భక్తులు బారులు తీరారు. ఉదయం 9:30 గంటలకు లక్ష మంది భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారని బెజవాడ ఆలయ అధికారులు



తెలిపారు. ఈరోజు 3 లక్షల పైచిలుకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. మూల నక్షత్రం సందర్భగా వీఐపీ, వీవీఐపీ దర్శనాలను రద్దు చేశారు. అన్ని క్యూ లైన్‌లలో ఉచిత దర్శనం ఏర్పాట్లు చేశారు. తిరుపతి తరహాలో భక్తులకు హోల్డింగ్ పాయింట్స్, పదికి పైగా కంపట్మెంట్స్ ఏర్పాటు చేశారు. క్యూ లైన్లలో ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్లలో ఉన్న భక్తులకు వాటర్ బొట్టిల్స్, బిస్కెట్ పాకెట్స్, పాలు, మజ్జిగ పాకెట్స్ పంపిణి చేస్తున్నారు. సరస్వతిదేవి అలంకారంలో దర్శనమిస్తున్న జగన్మాత దుర్గమ్మను కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, హోంమంత్రి వంగలపూడి అనిత, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) దర్శించుకున్నారు. మధ్యాహ్నం 3:30 గంటల నుంచి 4:30 నిముషాలకు సీఎం చంద్రబాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

# తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## హనుమంత వాహనంపై ఊరేగిన శ్రీవారు

తిరుమల **సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు సోమవారం ఉదయం 8 గంటలకు శేషాచలాధీశుడు శ్రీ కోదండ రాముని అవతారంలో ధనుస్సు, బాణం ధరించి తన భక్తుడైన హనుమంతునిపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. వాహనం ముందు భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. హనుమంతుడు భగవత్ భక్తులలో అగ్రగణ్యుడు. రామాయణంలో మారుతి స్థానం అద్వితీయం. చతుర్వేద నిష్ణాతుడుగా, లంకాభీకరుడిగా ప్రసిద్ధుడైన ఆంజనేయుడు వేంకటాద్రివాసుని మూపున వహించి



దర్శనమిచ్చారు. గురు శిష్యులైన శ్రీరామ హనుమంతులు తత్త్వ వివేచన గావించిన మహనీయులు కనుక వాహ్య వాహకరూపంలో ఈ ఇరువురిని చూసిన వారికి పుణ్య ఫలం లభిస్తుంది.సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు స్వర్ణరథంపై శ్రీమలయప్ప స్వామివారు భక్తులను కటాక్షిస్తారు. రాత్రి 7 గంటలకు గజవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, పలువురు బోర్డు సభ్యులు, జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో మురళి కృష్ణ,

# వైసిపి డిజిటిల్ బుక్‌లో సొంత నేతలపైనే ఫిర్యాదులు

## విడుదల రజనిపై ఫిర్యాదు చేసిన నేతలు

అమరావతి, **సెప్టెంబర్ 29 ఆంధ్ర ప్రగతి** వైసీపీ కొత్తగా తెచ్చిన 'డిజిటల్ బుక్' యాప్‌లో ఆ పార్టీ నేతలపైనే ఫిర్యాదులు అందుతున్నాయి. మాజీ మంత్రి విడదల రజినిపై తాజాగా ఫిర్యాదు అందింది. విడదల రజినిపై నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం ఆదివారం ఫిర్యాదు చేశారు. 2022లో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని నవతరం పార్టీ కార్యాలయం, తన ఇంటిపై రజిని దాడి చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ మంత్రి రజినిపై చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. సొంత డిజిటల్ బుక్ యాప్‌లో ఫిర్యాదు అందడంపై వైసీపీలో కలకలం రేపింది.'2022లో చిలకలూరిపేటలోని నవతరం పార్టీ కార్యాలయం, నా ఇల్లు, కారుపై మాజీ మంత్రి విడదల రజిని దాడి చేయించారు. మాజీ మంత్రిపై చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయాలని వైసీపీ అధ్యక్షుడు జగన్‌కి డిజిటల్ బుక్ యాప్ ద్వారా ఫిర్యాదు చేశా. ఈ ఫిర్యాదుపై నాకు న్యాయం చేస్తే జగన్ చెప్పినట్లు వైసీపీ కార్యకర్తలకూ న్యాయం




జరుగుతుందనే నమ్మకం కలుగుతుంది' అని రావు సుబ్రహ్మణ్యం తెలిపారు. వైసీపీ
డిజిటల్ బుక్ యాప్‌లో మాజీ మంత్రిపై ఫిర్యాదు చేసిన తర్వాత వచ్చిన టికెట్‌ను సుబ్రహ్మణ్యం మీడియాకు చూపించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ఇటీవల వైసీపీ కార్యకర్తల కోసం 'డిజిటల్ బుక్' వెబ్ సైట్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. తాజాగా తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో యాప్‌ను లాంచ్ చేశారు. ఈ డిజిటల్ బుక్ వైసీపీ కార్యకర్తలకు శ్రీరామ రక్ష అని జగన్ చెప్పారు. 'రెడ్ బుక్' గురించి మాట్లాడుతున్న వారికి 'డిజిటల్ బుక్' సమాధానం అని పేరొన్నారు. కార్యకర్తలకు అన్యాయం జరిగితే యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చాక అందరికీ న్యాయం చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. అన్యాయం చేసిన వారు ఎక్కడున్నా శిక్ష పడేలా చేస్తామని జగన్ చెప్పుకొచ్చారు. ఇప్పుడు మాజీ మంత్రి పైనే ఫిర్యాదు అందడంతో వైసీపీలో కలకలం రేపింది.

# గేమింగ్ యాప్స్‌పై సినీప్రముఖులను విచారించనున్న ఈడీ

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ దూకుడు ప్రదర్శిస్తోంది. కురాకో దేశంలో నమోదైన వివాదాస్పద ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ వన్ ఎక్స్‌బెట్ ప్రమోషన్లకు సంబంధించి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పలు కోట్ల రూపాయల విలువైన ఆస్తులను అటాచ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నది. పీఎంఎల్‌ఏ చట్టం కింద ఈ చర్యలు చేపట్టబోతున్నట్టు సమాచారం.ఈ కేసులో బాలీవుడ్ సెలబ్రిటీలు, మాజీ క్రికెటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు , పలువురు ప్రముఖుల పేర్లు ఈడీ రాడార్‌లో ఉన్నాయని తెలుస్తోంది. ప్రమోషన్ల ద్వారా వచ్చిన భారీ మొత్తాన్ని చాలామంది విలాసవంతమైన ఆస్తుల కొనుగోలు కోసం వాడుకున్నారని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈడీ, వాటిని క్రిమినల్ ఇన్‌కమ్‌గా పరిగణిస్తూ, ఆస్తులపై తాత్కాలికంగా అటాచ్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేసే దిశగా పకడ్బందీగా పని చేస్తోంది. ఈడీ దర్యాప్తులో బయటపడిన వివరాల ప్రకారం, ఈ సెలబ్రిటీలకు భారతదేశంతో పాటు యూఏఈ వంటి విదేశాల్లో కూడ స్థిరాస్తులు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఈ ఆస్తులపై పూర్తి నివేదిక సిద్ధం చేస్తూ, వాటిని తాత్కాలికంగా అటాచ్ చేయడానికి అవసరమైన ఆమోదం కోసం అథారిటీకి ఆర్డర్ పంపించనున్నట్టు సమాచారం. ఆమోదం లభించిన తర్వాత ప్రత్యేక కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసి, కోర్టు అనుమతి పొందిన తర్వాత ఆస్తులను శాశ్వతంగా జప్తు చేసే అవకాశముంది. ఈడీ ప్రశ్నించిన సెలబ్రిటీల జాబితాలో పలువురు ప్రముఖులు ఉన్నారు. వీరిలో మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, సురేష్ రైనా, రాబిన్ ఊతప్ప, శిఖర్ ధావన్, నటుడు సోను సూద్,బెంగాలీ నటుడు అంకుష్ హజ్రా,తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మిమి చక్రవర్తి,అలాగే ఉర్వశి రౌతేలా ఉన్నారు. అయితే భారత ప్రభుత్వం ఇటీవల ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధిస్తూ కొత్త చట్టాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. కానీ, నిషేధానికి ముందు దాదాపు 22 కోట్ల మంది భారతీయులు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు కనెక్ట్ అయ్యారని అంచనా. వీరిలో సగం మంది యాక్టివ్ యూజర్లు కావడం ఆశ్చర్యకరం.ఇప్పటికే విచారణలు ప్రారంభించడంతో పాటు ఆస్తుల జప్తు ప్రక్రియ కూడా ప్రారంభమైన నేపథ్యంలో, పలువురు సెలబ్రిటీలు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని సమాచారం.

# రాజాసాబ్ ట్రైలర్ టాక్..

## తాత మాయాజాలంలో ప్రభాస్ అల్లరి!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మొన్నటివరకు చేసిన సినిమాలు ఒక లెక్క ఇప్పుడు రాబోయే సినిమా మరొక లెక్క అనేలా తన లైనప్ ను సెట్ చేసుకుంటున్నాడు. ఇక మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ది రాజాసాబ్ హారర్ కామెడీ డ్రామాగా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ట్రైలర్ పై ముందునుంచి అంచనాలు గట్టిగానే పెంచారు. ఇక రిలీజ్ అవ్వగానే సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. రొమాంటిక్ కామెడీతో పాటు హారర్ టచ్ కూడా కలిపి చూపించడం ఈ ట్రైలర్ ను స్పెషల్‌గా నిలిపింది. ప్రభాస్ లుక్, స్టైల్, డైలాగ్ డెలివరీ కాస్త కొత్తగానే ఉన్నాయి. డార్లింగ్ ను కామెడీ యాంగిల్ లో చూసి చాలా కాలమైంది. ఇక ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ లాంటి హీరోయిన్స్ అందరూ స్క్రీన్ లో ఫ్రెష్ వైబ్ ఇచ్చారు. ఇక మహల్ కు సంబంధించిన రహస్యాలు దెయ్యం తాత గెటప్ లో సంజయ్ దత్ భయపెట్టనున్నట్లు తెలుస్తోంది. హారర్ కామెడీలో మంచి పట్టున్న మారుతి ఆ రూట్లో స్ట్రాంగ్ ఎంటర్టైన్మెంట్ ప్లాన్ చేసినట్లుగా అర్థమవుతుంది. ఇక ముగ్గురు భామల మధ్య రొమాంటిక్ డోస్ తో పాటు పలు మాస్ అప్పీల్స్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎమోషనల్ గా బామ్మ సెంటిమెంటును కూడా జత చేసినట్లు అర్థమవుతుంది. సినిమాలో ప్రధానంగా గ్రాఫిక్స్ బాగా ఇన్నట్లు హైలెట్ చేశారు. పొగ నుంచి వచ్చే దెయ్యాలు, వికృత రూపం, మొసలి అలాగే పెద్ద బల్లులు ఇలా గట్టిగానే విజువల్స్ ను చూపించనున్నట్లు అర్థమవుతుంది. ఇక ఈ గ్రాఫిక్స్ పై ఆడియెన్స్ రెస్పాన్స్ ఎలా ఉంటుందో చూడాలి. చివరలో తలకిందులుగా మహల్ లో రాజాసాబ్ గెటప్ లో ప్రభాస్ రోల్ డిఫరెంట్ గా ఉంది. ఆ క్యారెక్టర్ కూడా ఫోకస్ అయ్యేలా ఉంది. ప్రత్యేకంగా సాంగ్స్, హారర్ ఎలిమెంట్స్ మిక్స్ కావడంతో ట్రైలర్ ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజీలా కనిపిస్తోంది. మొత్తానికి ది రాజాసాబ్ ట్రైలర్ ప్రభాస్ కెరీర్ లో కొత్తగా ప్రయత్నించిన ఎంటర్‌టైన్‌మెంట్ జానర్ ను చూపించింది. కామెడీ, రొమాన్స్, హారర్ అన్నీ కలిపిన ఈ సినిమా ట్రైలర్ పై ఆడియెన్స్ రెస్పాన్స్ ఎలా ఉంటుందో చూడాలి. సినిమాను 2026 జనవరి 9న రిలీజ్ చేయనున్నట్లు ట్రైలర్ తో అఫీషియల్ గా మరో క్లారిటీ ఇచ్చేశారు. ఆ టైమ్ లో కంటెంట్ కాస్త క్లిక్కయినా కలెక్షన్స్ కు తిరుగుండదు. మరి మారుతి మ్యాజిక్ ఎంతవరకు క్లిక్కవుతుందో చూడాలి.






# నేచురల్స్ లుక్స్‌లో డింపుల్‌హయతి

అందం అభినయం ఉన్నా కూడా చాలా మంది హీరోయిన్స్ అదృష్టం కలిసి రాక రేస్ లో వెనకపడుతున్నారు. సినిమా అవకాశాలు అందుకుంటున్నా కూడా సరైన హిట్స్ లేక స్టార్ డమ్ తెచ్చుకోలేకపోతున్నారు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నప్పటికీ అంతగా గుర్తింపు తెచ్చుకోలేక పోతున్నారు. వారిలో డింపుల్ హయాతి ఒకరు. అందం అభినయం ఉన్న ఈ గ్లామర్ బ్యూటీ తన వయ్యారంతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. ఇక తెలుగు, తమిళ్, హిందీ భాషల్లోనూ సినిమాలు చేసింది. కానీ అంతగా సక్సెస్ అందుకోలేకపోయింది. హీరోయిన్ గానే కాదు.. గెస్ట్ రోల్స్ చేసింది. అలాగే స్పెషల్ సాంగ్ కూడా చేసింది.. అయినా స్టార్ డమ్ అందుకోలేకపోయింది. డింపుల్ హయాతి 2017లో 'గల్ఫ్' సినిమాతో సినీరంగంలోకి వచ్చింది. ఆతర్వాత 2019లో యురేక సినిమాలో నటించింది. అయినా కూడా గుర్తింపు రాలేదు. అదే సమయంలో వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' సినిమాలో 'జర్ర జర్ర ' పాటలో నటించింది. ఈ పాటలో హాట్ లుక్ లో మెరిసి ఆకట్టుకుంది. ఆతర్వాత రవితేజ నటించిన ఖిలాడీ సినిమాలో మరోసారి తన గ్లామర్ తో ఆకట్టుకుంది. చివరిగా రామబాణం అనే సినిమాలో కనిపించింది. కానీ ఈ సినిమా కూడా హిట్ అవ్వలేదు. ఇక ఇప్పుడు యంగ్ హీరో శర్వానంద్ తో కలిసి నటిస్తుంది డింపుల్. బోగి అనే టైటిల్ తో తెరకెక్కుతున్న సినిమాలో డింపుల్ హీరోయిన్ గా ఎంపికైంది. ఇటీవలే ఈ సినిమా నుంచి గ్లింప్స్ విడుదల చేశారు. ఈ సినిమా పై డింపుల్ ఆశలు పెట్టుకుంది. ఈ సినిమాతో ఈ ముద్దుగుమ్మ మంచి విజయాన్ని అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. మరి ఈ చిన్నదానికి హిట్ అందుతుందేమో చూడాలి. సోషల్ మీడియాలో ఈ చిన్నది షేర్ చేసే ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

# క్యూట్ ఫొటోలు షేర్ చేసిన రీతూ వర్మ

తెలుగమ్మాయి రీతూ వర్మ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ ప్రారంభించిన ఈ భామ ఇప్పుడు హీరోయిన్‌గా మారిన సినిమాలు చేస్తోంది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ వరుసగా సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. కెరీర్ బిగినింగ్ లో పలు షార్ట్ ఫిలిమ్స్ లోనూ నటించింది ఈ భామ. ఆతర్వాత సినిమాల్లోకి వచ్చింది. ఎన్టీఆర్ హీరోగా నటించిన బాద్షా సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ గా హీరోయిన్ చెల్లి పాత్రలో మెరిసింది. ఆ తర్వాత కొంత గ్యాప్ ఇచ్చింది. ఇక హీరోయిన్ గా మారి తొలి సినిమాతోనే ఆకట్టుకుంది. 2013లో ప్రేమ ఇష్క్ కాదల్ అనే సినిమాలో హీరోయిన్ గా చేసింది రీతూ వర్మ. ఈ సినిమా ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోకపోయినా.. ఈ చిన్నది తన నటనతో మెప్పించింది. ఆతర్వాత నా రాకుమారుడు, ఎవడే సుబ్రహ్మణ్యం సినిమాల్లో హీరోయిన్ గా చేసి ఆకట్టుకుంది. ఇక 2016లో వచ్చిన పెళ్ళిచూపులు సినిమా ఈ బ్యూటీకి మంచి క్రేజ్ తెచ్చిపెట్టింది. ఆతర్వాత వరుసగా అవకాశాలు అందుకుంది. నిన్నిలా నిన్నిలా, టక్ జగదీష్, ఒకే ఒక జీవితం, కణం, ఆకాశం, మార్క్ ఆంటోని సినిమాలు చేసింది. ఈ భామ నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాల ఎంచుకుంటూ రాణిస్తుంది. ఇటీవలే శ్రీవిష్ణుతో స్వాగ్ , సందీప్ కిషన్ తో మజాకా సినిమాలు చేసింది. ఈ రెండు సినిమా అంతగా ఆకట్టుకోకపోయినా యావరేజ్ గా మిగిలాయి. ఇప్పుడు ఈ చిన్నది ఓ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందు రానుంది. దేవిక అండ్ డానీ అనే టైటిల్ తో ఈ వెబ్ సిరీస్ రానుంది. ఈ క్రమంలోనే రీతూ వర్మ కొన్ని క్రేజీ ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుంది. ఈ ఫోటోలు నెటిజన్స్ ను కట్టిపడేస్తున్నాయి.



# ఓజీ' కలెక్షన్ల సునామీ.. నాలుగు రోజుల్లోనే రూ. 252 కోట్లు!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ నెల 25న విడుదలైన ఈ సినిమా, కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 252 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సోషల్ మీడియా వేదికగా ఓ ప్రత్యేక పోస్టర్‌తో అధికారికంగా ప్రకటించింది.ఈ చిత్రానికి తొలిరోజే అద్భుతమైన స్పందన లభించింది. విడుదలైన మొదటి రోజే ఏకంగా రూ. 154 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం. ఈ భారీ ఓపెనింగ్‌తో, మొదటి రోజు అత్యధిక వసూళ్లు సాధించిన టాప్-10 భారతీయ చిత్రాల జాబితాలో 'ఓజీ' చోటు దక్కించుకుంది. నాలుగు రోజుల్లోనే రూ. 200 కోట్ల క్లబ్‌లో చేరి పవన్ కల్యాణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచింది.సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో పవన్ కల్యాణ్ 'ఓజాస్ గంభీర' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. ఆయన స్టైలిష్ లుక్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్, తమన్ అందించిన నేపథ్య సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చాలాకాలంగా అభిమానులు ఆశిస్తున్న అసలైన యాక్షన్ సినిమా ఇదేనంటూ ప్రశంసలు కురుస్తున్నాయి.



# తండ్రి అడుగుజాడల్లో అజిత్ కుమారుడు

తన విజయాల వెనుక భార్య షాలిని హస్తం ఎంతో ఉందని చెబుతూ ప్రముఖ తమిళ నటుడు అజిత్ కుమార్ తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. రీసెంట్‌గా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారన్న విషయంపై స్పందించారు. భార్య షాలిని సహకారం లేకపోతే తాను ఇంతదూరం రావడం సాధ్యపడేదికాదని అజిత్ స్పష్టంగా పేర్కొన్నారు. "మేము 2002లో పెళ్లి చేసుకున్నాం. అప్పటినుంచి ఆమె నాకు బలంగా నిలిచింది. నేను రేసింగ్‌కు తిరిగి వచ్చినప్పుడు కూడా ఆమె నాతోపాటే వచ్చేది. ఇంటి విషయాలు, పిల్లల సంరక్షణ, నా పనులపై దృష్టి అన్నింటినీ సమర్థంగా నిర్వహించేది అని ఆయన అన్నారు. పిల్లలు పుట్టిన తర్వాత షాలిని ఎక్కువగా ఇంటికే పరిమితమైపోయినా, మోటార్ స్పోర్ట్స్ పట్ల ఆసక్తిని మాత్రం కొనసాగిస్తోందని తెలిపారు. తన కుమారుడు గో-కార్టింగ్ ప్రారంభించిన విషయాన్ని వెల్లడించిన అజిత్, "అతను రేసింగ్‌ను కొనసాగిస్తాడో లేదో అతడే నిర్ణయించాలి.

